RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 196 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 ఆగష్టు 2024 గురువారం పేజీలు : 4

## వయనాడ్ బాధితుల సహాయార్థం భారీ విరాళం

'వీడు ఎక్కడున్నా రాజేరా' అని 'బాహుబలి' సినిమాలో ప్రభాస్‌ను ఉద్దేశించి ఓ డైలాగ్ ఉంటుంది. ఆ డైలాగ్‌ను అక్షరాలా నిజం చేసి చూపిస్తున్నారు రెబల్ స్టార్ ప్రభాస్. ప్రస్తుతం ప్రభాస్ రేంజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నెంబర్స్‌తో కొలవలేని స్థానం ప్రభాస్‌ది. టాలీవుడ్ దశ, దిశ మార్చిన డైరెక్టర్ రాజమౌళి అయితే.. హీరో మాత్రం ప్రభాస్ అనే చెప్పి తీరాలి. ఆయన చేసే సినిమాలు, ఆయన చేసే దానాలు, ఆయన పెట్టే తిండి.. అన్నీ కూడా భారీగానే ఉంటాయి. ఆ విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడు మరోసారి తన గొప్ప మనసును చాటాడీ 'సలార్'. వయనాడ్ విపత్తు బాధితులకు అండగా నిలబడేందుకు చిత్ర పరిశ్రమలోని పలువురు స్టార్స్ ముందుకొస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ నుంచి ఇప్పటికే సెలబ్రిటీలెందరో సాయం ప్రకటించారు. తాజాగా ప్రభాస్ వయనాడ్ విపత్తు సహాయార్థం రూ. 2 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించి.. తన గొప్ప మనసును చాటుకున్నారు.

# అవునా... నిజమా...!?

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం..ఇది వాస్తవమేనా..?




హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా విజయం సాధించ కపోవడం..అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 39 ఎమ్మెల్యేల్లో దాదాపు 09 మంది కాంగ్రెస్ లోకి వెళ్లడం..మరికొంతమంది కూడా ఇదే బాటలో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం..మరోపక్క బిడ్డ జైలు జీవితం..రోజు రోజుకు ప్రజల్లో బిఆర్ఎస్ ఉనికి తగ్గుతూ ఉండడం..ఇదే క్రమంలో పలు స్కాముల్ల పేరుతో కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలనీ కాంగ్రెస్ సర్కార్ చూస్తుండడం..ఇలా వరుస ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నాడని.. తన పార్టీ బిఆర్ఎస్ ను బిజెపి లో విలీనం చేసేందుకు సిద్ధం అయ్యాడనే ఓ వార్త ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఓ మీడియా ఛానల్ లో బిఆర్ఎస్ పార్టీ ని బిజెపి లో విలీనం చేసేందుకు కేసీఆర్ సిద్ధమయ్యాడనే ప్రచారం బిఆర్ఎస్ శ్రేణులను కలవరపాటుకు గురిచేస్తుంది. మరి ఇది ఎంతవరకు నిజం..?

ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణాలను సైతం ఫలంగా పెట్టి..తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్..ఈ చిన్న చిన్న ఇబ్బందులకు భయపడతాడా..? అధికారం శాశ్వతం కాదని నమ్మే కేసీఆర్..కాంగ్రెస్ కు భయపడి బిజెపి లో విలీనం చేస్తాడా..? ఎంత రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్...'తిమ్మిని బమ్మిని' చేయగల సమర్థుడు..తన మాటలతో ప్రత్యర్థి పార్టీలకు చెమటలు పట్టించగల మాటకారి..బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు భయపడి తన పార్టీ ని మరో పార్టీ లో కలుపుతాడా..? ఇది ముమ్మాటికీ జరగని పని అని బిఆర్ఎస్ శ్రేణులు అంటున్న మాట. పదేళ్ల లో తెలంగాణ ను దేశంలోనే నెం 1 రాష్ట్రంగా అభివృద్ధి చేసాడు. హైదరాబాద్ తో పాటు అనేక నగరాలను ఎంతో అభివృద్ధి చేసాడు. అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ఇంటికి పెద్ద కొడుకు అయ్యాడు. రూ.200 పెన్షన్ ను రూ.2 వేలు చేసిన ఘనుడు..మారుమూల గ్రామానికి కూడా భగీరథ నీరు తెచ్చి నీటి ఎద్దడి లేని రాష్ట్రంగా తీర్చి దిద్దిన ధీరుడు..రైతున్నాలపాలిట దేవుడైన కేసీఆర్..వెనకడుగు వెయ్యడమా..అసాధ్యం అని అంటున్నారు. ఎన్ని కష్టాలు వచ్చిన , ఎన్ని ఇబ్బందులు పెట్టిన, అన్ని తట్టుకొని మళ్లీ సీఎం అవుతాడని..తెలంగాణ ప్రజల కష్టాలను తీరుస్తాడని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి నిజంగా పార్టీ శ్రేణులు భావిస్తుందే జరుగుతుందా..? లేక మీడియా లో ప్రచారం అవుతున్నట్లు బిజెపి లో విలీనం చేస్తారా..? అనేది కేసీఆరే క్లారిటీ ఇవ్వాలి.



## పడతాం, లేస్తాం...

### తెలంగాణ కోసమే పోరాడుతాం... కానీ తలవంచం..!!

హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ పొత్తు, విలీనంపై గత కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కీలక పోస్ట్ పెట్టారు. కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీపైన, విలీనం లాంటి దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలని.. లేదంటే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ తమది అని అన్నారు. ఇవన్నీ దాటుకొని 24 ఏళ్ల పాటు నిబద్ధతతో పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పుకొచ్చారు. సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రప్రదాన నిలిపామన్నారు. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దామని చెప్పారు. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైందని అన్నారు.

## ఉపవర్గీకరణపై బీజేపీ మౌనమేల?




తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారిన ఎస్సీ వర్గీకరణ అంశంపై బీజేపీ ఎందుకు నోరు మెదపడం లేదు ? మొదటి నుంచి వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని పదే పదే చెప్పిన తెలంగాణ నేతలు.. తీరా సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇచ్చాక.. సైలెంట్ అయిపోవడం పట్ల ఆంతర్యం ఏంటి? వర్గీకరణ అంశంలో ఇంకేమైనా లొసుగులు ఉన్నాయా..? వర్గీకరణ అంశంపై దూరంగా ఉండాలని నేతలకు హైకమాండ్ నుంచి ఆదేశాలు వచ్చాయా ? రాష్ట్రాలు ఎస్సీ కులాల ఉపవర్గీకరణ చేసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు కేంద్రంలోని ఎన్డీయేను కుదిపేస్తోంది. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని.. వర్గీకరణ సాధించేందుకు తమ వంతుగా శ్రమిస్తామని.. ప్రధాని మోడీ పార్లమెంట్ ఎన్నికలకు ముందు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సాక్షిగా హామీ ఇచ్చారు. మాదిగ సామాజిక అభివృద్ధికి అవసరమైన ఆర్థిక విధానాలు మెరుగు పరిచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వర్గీకరణను లీగల్ గా ఎదుర్కొనేందుకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట మేరకు మోడీ కేంద్ర కేబినెట్ సెక్రటరీ ఆధ్వర్యంలో కమిటీని కూడా నియమించారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. కమిటీ నివేదికతో పాటు ప్రభుత్వ ఆలోచనను కూడా పరిగణలోకి తీసుకుని వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇక ఈ తీర్పుతో ఎన్నికల సందర్భంగా మోడీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని బీజేపీ వర్గాలో చర్చ జరుగుతోంది. అయితే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పుపై బీజేపీ నేతలు ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం తీవ్ర చర్చకు దారి తీస్తోంది. బీజేపీ అధిష్టానం ఇచ్చిన ఆదేశాలతోనే.. తెలంగాణ నేతలు వర్గీకరణ అంశంపై గప్ చుప్ అయ్యారని టాక్. వర్గీకరణను స్వాగతిస్తున్నామంటూ ఎవరికి వారు ముందుగా మీడియాకు ప్రకటనలు కూడా ఇచ్చి.. ఆ తర్వాత కొద్దిసేపటికే గ్రూపుల్లో ప్రకటనలు తొలగించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ మెసేజ్ లను తొలగించడం వెనుక హై కమాండ్ ఆదేశాలు ఉన్నాయని భావిస్తున్నారు. వర్గీకరణపై పాజిటివ్ గాను.. నెగిటివ్ గాను ఎలాంటి కాంట్రవర్సీ చేయొద్దని రాష్ట్ర నాయకత్వానికి హైకమాండ్ సూచనలు చేసినట్లు పొలిటికల్ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. వర్గీకరణ అంశంపై పాజిటివ్ గా మాట్లాడితే.. మిగతా వర్గాలకు అది నెగెటివ్ అయ్యే అవకాశం ఉండటంతో.. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. అందుకే నేతలు సైలెంట్ గా ఉండాలని దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. అగ్ర నాయకత్వం ఆదేశాలతో వెంటనే కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారని అంటున్నారు. వర్గీకరణ అంశంపై ఏ ఒక్క నేత మాట్లాడకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. వర్గీకరణ అంశం ఒక సామాజిక సమస్య కావడంతో.. ఆ విషయాన్ని రాజకీయ కోణంతో చూడొద్దని స్పష్టం చేసినట్టు టాక్ నడుస్తోంది. వర్గీకరణపై సుప్రీం తీర్పుతో ఎవరికైనా అన్యాయం జరుగుతుందని భావిస్తే.. వారిపై కేంద్రం సానుకూలంగా స్పందించి న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉందనే భరోసాను కల్పించాలని సూచనలు చేసినట్టు చెబుతున్నారు. దాంతోనే అప్పటికే స్టేట్‌మెంట్ ఇచ్చిన ఒకరిద్దరు నేతలు కూడా వెనక్కు తగ్గారని స్పష్టం అవుతోంది. సంకీర్ణ భాగస్వాముల మధ్య ఈ వ్యవహారం కుదిపేస్తోంది. సుప్రీంకోర్టు తీర్పును కేంద్రంలో కీలక మిత్రపక్షమైన టీడీపీ స్వాగతిస్తుండగా.. మరో భాగస్వామి లోక్ జన్ శక్తి పార్టీ మాత్రం వ్యతిరేకిస్తోంది. దీనిపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసేందుకు కూడా సిద్ధమవుతోంది. అలానే వర్గీకరణ ప్రకటనతో మాల సామాజిక వర్గం నిరసన తెలుపుతోంది. ఎస్సీల వర్గీకరణ ఆపాలని డిమాండ్ చేస్తోంది. దీంతో బీజేపీ పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యి అన్నట్టు ఉందని చర్చ జరుగుతోంది.



## సీతారామ ప్రాజెక్టుకు ముహూర్తం ఖరారు

### ఆగష్టు 15న సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

### వెల్లడించిన నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆగస్టు 15న ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని జలసౌధలో అధికారులతో కలిసి ఆయన నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ను ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ,సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యదినోత్సవం రోజు గోల్కొండ కోటలో సీఎం రేవంత్ జెండా ఎగరేశాక హెలికాప్టర్ ద్వారా నేరుగా ఖమ్మం జిల్లా వైరాకు ముఖ్యమంత్రి చేరుకుంటారని ఉత్తమ్ తెలిపారు. అక్కడే భోజనాలు చేసి వైరాలో జరగనున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని అన్నారు. అంతకుముందే సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను రేవంత్ ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం రైతుల కల త్వరలో నెరవేరబోతోందని ఆయన స్పష్టం చేశారు.

**లక్షల సంఖ్యలో రైతులతో సభ..** దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను జాతికి అంకితం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా వైరాలో లక్ష మంది రైతులతో బహిరంగ నిర్వహిస్తామని తెలిపారు. సభా స్థలాన్ని ఖమ్మం కలెక్టర్ ముజ్మమిల్‌ఖాన్, ఖమ్మం సీపీ సునీల్‌దత్ తదితరులతో కలిసి ఆయన ఇటీవల పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారిగా ఆగస్టు 5న సాగర్ జలాలను విడుదల చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఒకవైపు కృష్ణా జలాలు, మరోవైపు గోదావరి జలాలు వైరా రిజర్వాయర్ సహా ఖమ్మం జిల్లాలో ఆగస్టు 15 నాటికి ప్రవహించనున్నాయని తెలిపారు. అలాగే రైతు రుణమాఫీకి సంబంధించి కూడా సీఎం రేవంత్‌రెడ్డి వైరా సభలో స్పష్టమైన ప్రకటన చేస్తారని చెప్పారు. ఆగస్టు 15న రైతు దినోత్సవంగా జరుపుకోబోతున్నా మని వెల్లడించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సొంత ప్రాంతంలో సీఎం బహిరంగ సభ నిర్వహించేందుకు ఆయన కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

గరుడ వార్త



# సంపాదకీయం

## జగన్ ఎందుకింత బేలగా ?

వైఎస్ జగన్ అంటేనే డేరింగ్ అండ్ డేషింగ్. అలాంటి జగన్ ఇపుడు ఎందుకో పదే పదే టీడీపీ వారి ట్రోలింగులకు గురి అవుతున్నారు. జగన్ కి ఏమైంది అని టీడీపీ తాజాగా ట్వీట్ చేసింది. ప్రతిపక్ష హెూదా లేకపోయినా హెూదా కావాలీ అంటూ జగన్ హైకోర్టులో పిటిషన్ వేశారని, ఇపుడు సీఎం కాకపోయినా సీఎం స్థాయి సెక్యూరిటీ కావాలని మరో పిటిషన్ వేశారని ఇంతకీ జగన్ కి ఏమైంది అంటూ టీడీపీ ట్వీట్ చేసింది. అది కాస్తా వైరల్ అయింది. నిజానికి ఈ రెండు విషయాల్లోనూ జగన్ కోర్టు తలుపులు తట్టడం వెనక ఆయన వ్యూహాలు ఏమైనా వైసీపీలోనూ చర్చ సాగుతోంది. క్యాడర్ లోనూ ఒకింత నైరాశ్యం కలుగుతోంది. జగన్ అన్న వ్యక్తి ఒకే ఒక్కరు. ఆయనే ఇంతటి పార్టీని నిర్మించి అధికారంలోకి తెచ్చారు. అలాంటి జగన్ మళ్లీ ఒక్కడిగా వెళ్ళి ప్రజల మద్దతు సాధించలేరా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. జగన్ ఈసారి ఎన్నికల్లో ఓటమికి ప్రధాన కారణం ప్రజల్తో పార్టీతో కనెక్షన్ కట్ అవడం. అలాగే పార్టీని పూర్తిగా పక్కన పడేయడం. ఈ విషయాలను ఆకలింపు చేసుకుని దాని మీద ఫోకస్ పెట్టి జగన్ వైసీపీని పునర్ నిర్మించుకుని రావాల్సి ఉందని అంటున్నారు. జగన్ అలా చేయకుండా ప్రతిపక్ష హెూదా మీద న్యాయ పోరాటం చేయడం పట్ల పార్టీ లోపలా బయటా చర్చ సాగుతోంది. కోర్టులో ఏ విధంగా తీర్పు వచ్చినా కూడా జగన్ కు హెూదా ఇవ్వాల్సింది అయితే స్పీకర్ అని ఆయన విచక్షణాధికారాల మేరకే అది లభిస్తుందని జగన్ కి తెలియదా అని అంటున్నారు. జనాల్లో ఈ అంశాన్ని పెట్టి రాజకీయంగా టీడీపీని బదనాం చేయాలని అనుకున్నా దాని కంటే ముందు జగన్ ని బదనాం చేసేందుకు టీడీపీ చూస్తోంది. ఆ పార్టీకి ఆ అవకాశం జగన్ ఇచ్చారు అని అంటున్నారు. హెూదా లేకపోతే జగన్ అసెంబ్లీకి వెళ్లరా అని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల కూడా ప్రశ్నించారు. ఇదే విషయం టీడీపీ కూడా ప్రశ్నిస్తోంది. దాంతో జగన్ కి జనంలో ఏమైనా సానుభూతి ఈ విషయంలో వస్తుందన్నది లేకుండా పోతోంది. అదే టైం లో జగన్ అసెంబ్లీకి వెళ్ళడం లేదు అన్నది జనానికి అర్థం అవుతోంది. ఇక రెండవ విషయం తీసుకుంటే సెక్యూరిటీ. తనకు ప్రాణహాని ఉందని జగన్ కోర్టుకు వెళ్లారు. తనకు పూర్వపు భద్రతను పునరుద్ధరించాలని ఆయన కోరుతున్నారు. అయితే జగన్ కి సీఎం హెూదాలో ఇచ్చిన భద్రత ఎలా ఇస్తామని టీడీపీ కూటమి అంటోంది. జగన్ కి అరవై మంది దాకా భద్రతతో సిబ్బంది ఉన్నారని బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఉందని ఇంతకంటే వేరేగా భద్రత ఏమి కావాలని నారా లోకేష్ ప్రశ్నిస్తున్నారు. అంతలా అభద్రతాభావం ఎందుకు జగన్ అని ఆయన నిలదీస్తున్నారు. జగన్ వైసీపీ అధినాయకుడు. అయిదేళ్ల పాటు సీఎం గా పనిచేసిన వారు. ఆయన ధైర్యంగా ఉంటేనే క్యాడర్ ధీర్యంగా ఉంటుంది. తనకే ప్రాణ హాని ఉందని జగన్ చెప్పుకుంటే ఇక క్యాడర్ నైరాశ్యంలోకి వెళ్ళిపోతుంది. జగన్ సెక్యూరిటీ తగ్గించలేదు అని ప్రభుత్వం అంటోంది. అయితే ప్రాణ హాని ఉందని భావిస్తే మరింతగా పెంచుతారు. కోర్టులో విచారణ తరువాత ఏ రకంగా తీర్పు వస్తుందో చూడాలి. ఏది ఏమైనా జగన్ లేవనెత్తిన ఈ రెండు అంశాలూ ఆయన్ని జనంలో బలవంతుడిగా అయితే చూపించడం లేదు. పైగా ఆయన బేలగా ఉన్నారని చెప్పకనే చెబుతున్నట్లుగా ఉందని అంటున్నారు. జగన్ ప్రజా సమస్యల మీద కోర్టుకు వెళ్ళడం లేదని తన సొంతం గురించే వెళ్తున్నారు అని హెూం మంత్రి వంగలపూడి అనిత చేస్తున్న విమర్శలూ వైసీపీని ఆలోచింపచేస్తున్నాయి. జగన్ వీటి మీద దృష్టి పెట్టకుండా వైసీపీని ఎలా పటిష్టం చేసుకోవాలి అన్న దాని మీదనే ఫోకస్ పెడితే బాగుంటుంది అని కూడా సూచనలు వస్తున్నాయి. అలాగే ఆయన అసెంబ్లీకి వెళ్ళి ప్రజా సమస్యల మీద ప్రభుత్వాన్ని నిలదీస్తే ఆ వచ్చే మైలేజ్ వేరే విధంగా ఉంటుందని కూడా అంటున్నారు.

## స్వచ్ఛ ధనం, పచ్చదనంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి ....



శామీర్ పేట, (గరుడ వార్త) : రాష్ట్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ధనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం తూముకుంట మున్సిపల్ పరిధిలోని సింగాయిపల్లిలో స్వచ్ఛదనం, పచ్చదనం లో భాగంగా ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ స్థలాల్లో అత్యధికంగా మొక్కలు నాటాలని తెలిపారు. అనంతరం సింగాయిపల్లి లోని పలు కాలనీలలో పాడైన రోడ్లపై వెట్ మిక్స్ వేసి రోడ్లను చదును చేశారు అనంతరము తూంకుంట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుక్క కాటు నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై కమీషనర్ వెంకట గోపాల్ తగు సూచనలు చేశారు. మున్సిపల్ పరిధిలోని 16 వార్డులలో పాడైన రోడ్లపై వెట్ మిక్స్ వేసి రోడ్లను చదును చేశారు. అలాగే మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాలలో లో డీ ఎం డబ్ల్యూ ఓ స్పెషల్ ఆఫీసర్ వాణి, డిప్యూటీ ఈఈ సునీత, మేనేజర్ శ్రవణ్ కుమార్, ఆర్ ఐ భాస్కర్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్లు , సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యువెలరీ దుకాణంలో భారీ చోరీకి బరితెగించిన దొంగలు...

### 45 తులాల బంగారం 70 కిలోల వెండి ఆభరణాల అపహరణ
### సంఘటన స్థలాన్ని పరిశీలించిన డిసిపి, అడిషనల్ డీసీపీ, ఏసిపి....






శామీర్ పేట, (గరుడ వార్త) : బంగారం దుకాణంలో భారీ చోరీకి దొంగలు బరితెగించిన సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కృష్ణ జువెలరీస్ బంగారం దుకాణంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడి 45 తులాల బంగారు ఆభరణాలు, 70 కిలోల వెండి ఆభరణాలను, మరికొంత నగదును మంగళవారం అర్ధరాత్రి దొంగిలించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూముకుంట మున్సిపాలిటీకి చెందిన దుకాణం యజమాని జగదీష్ ఆయన కుమారుడైన గణేష్ మంగళవారం రాత్రి రోజు మాదిరిగా దుకాణం మూసి వెళ్లారు. గుర్తుతెలియని దొంగలు దుకాణం షట్టర్ పైకెత్తి లోపల ఉన్న 48 తులాల బంగారు ఆభరణాలు, 80 కిలోల వెండి వస్తువులు, మరికొంత నగదును చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు మంగళవారం అర్ధరాత్రి జువెలరీ దుకాణం షెటర్ను పైకెత్తి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఆభరణాలతోపాటు సీసీ ఫుటేజ్ ల హార్డ్ డిస్క్ సైతం ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. చోరీ జరిగిన దుకాణాన్ని బాలానగర్ డిసిపి సురేష్ కుమార్, మేడ్చల్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు పరిశీలించారు. క్లూస్ టీం బృందం ఆధారాలను సేకరించారు. శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ చేసిన ఉత్తుంగ ఫౌండేషన్



శామీర్ పేట, (గరుడ వార్త) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉత్తుంగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశా రు. బుధవారం తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వాహకులు నిరంజన్, వెంకటరమణిలు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఉత్తుంగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ఫౌండేషన్ మొదటి కార్యక్రమం ఇదని, భవిష్యత్తులో మా ఫౌండేషన్ నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్, స్థానిక వార్డు కౌన్సిలర్ రాజు యాదవ్, పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు అన్నపూర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెత్త డబ్బా.. శుభ్రం చేసేదెవరబ్బా?



హైదరాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో మంచి మార్కులు పొందాలన్న ఉద్దేశంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం ఏడాదికోసారి నగరంలోని రోడ్లపై చెత్త డబ్బాలను ఏర్పాటు చేస్తోంది. అందుకోసం దాదాపు రూ.3 కోట్లు వెచ్చిస్తోంది. ఏర్పాటు చేశాక నిర్వహణను అధికారులు గాలికొదిలేస్తున్నారు. డబ్బాల్లోని చెత్తను ఎవరు తొలగించాలనే అంశంపై స్పష్టత కొరవడింది. జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థలు నువ్వంటే నువ్వని చెప్పుకొంటూ బాధ్యతను విస్మరిస్తున్నాయి. దాంతో.. అవన్నీ వ్యర్థాలతో నిండిపోయి పరిసరాల్లో దుర్వాసన వస్తోంది. పాదచారులు అటుగా నడవలేని దుస్థితి నెలకొంది.

అనాథలైన డబ్బాలు..2021, 2022లో మాదిరే 2023లో 2,794 డబ్బాలను జీహెచ్ఎంసీ కొనుగోలు చేసింది. వాటిని ప్రధాన రహదారులకు ఇరువైపులా కాలిబాటలపై ఏర్పాటు చేసింది. అంతవరకు అధికారుల్లో కనిపించిన శ్రద్ధ.. తర్వాత మాయమైంది. వాటిని ఎవరు శుభ్రం చేయాలనే అంశాన్ని నిర్ణయించలేదు. వాణిజ్య కేంద్రాల చెంత, ప్రధాన రహదారులు, వీధుల్లో ఉండే చెత్తను శుభ్రం చేసే బాధ్యత రాంకీ సంస్థకు అప్పగించడంతో.. చెత్త డబ్బాలను ఆ సంస్థ పట్టించుకోవట్లేదు. అలాగని.. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులూ క్రమం తప్పకుండా శుభ్రం చేయట్లేదు.

మొక్కుబడి కార్యక్రమంగా మారి...

పాదచారులు తమ చేతిలోని చిత్తు కాగితాలు, ఇతర వ్యర్థాలను, మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఈ డబ్బాల్లో వేస్తుంటారు. రెండు, మూడు రోజులకోసారైనా వాటిని శుభ్రం చేస్తుంటే.. ప్రజలు మరింత ఎక్కువగా ఉపయోగించే వీలుంటుంది. పది రోజులు, రెండు వారాలు, నెలకోసారి శుభ్రం చేస్తుండటంతో.. అన్ని రోజులపాటు వ్యర్థాలతో నిండి కనిపిస్తున్నాయి. ఆ క్రమంలో దుర్గంధం వస్తోంది. రద్దీ ప్రాంతాల్లో వాటి పరిసరాల్లో జనం నిలవలేని పరిస్థితి ఉంది. అధికారులు కమీషన్ల కోసం డబ్బాలను కొనుగోలు చేస్తున్నారని, మొక్కుబడిగా వాటిని రోడ్లపై ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

మాంసం వ్యర్థాల తరలింపులో నిర్లక్ష్యంతో...

హెూటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిన ఆహార పదార్థాలను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నాయి. మాంసం దుకాణాలు, చేపల మార్కెట్లలోని వ్యర్థాలనూ వారే తీసుకెళ్తున్నారు. ఆ క్రమంలో వాటిని తరలించే వాహనాల వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మూతలేని ట్రాలీల్లో జంతు వ్యర్థాలను నిండుగా పోస్తున్నారు. వాటిలోని రక్తం, ద్రవ వ్యర్థాలు ట్రాలీ నుంచి రోడ్లపై పడుతున్నాయి. తరలించే క్రమంలో రోడ్లన్నీ వాటితో తడిసిపోతున్నాయి. వాసన వ్యాపిస్తోంది. ట్రాలీ వెనుక ప్రయాణించే వాహనదారులు నరకం చూస్తున్నారు. జంతు వ్యర్థాల యాజమాన్యం, తరలింపుపై జీహెచ్ఎంసీ దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## దోమలను ఎదుర్కొనేందుకు సిద్ధమేనా?

కరీంనగర్ : జిల్లాలోనూ ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో అధ్వానంగా తయారయ్యాయి. ఒక్క వర్షం పడితే చాలు అవి కుంటలుగా మారుతాయి. మురుగునీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారే ప్రమాదం ఏర్పడనుంది. వ్యాధులు ముసురుకునే అవకాశం ఉండగా ఆ స్థల యజమానులు మాత్రం పట్టనట్లుగా ఉంటున్నారు. పురపాలికలు, నగరపాలికలు మాత్రం ఫిర్యాదులు వచ్చిన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలపై 'న్యూస్‌టుడే' కథనం..

జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి, కొత్తపల్లి పురపాలికల పరిధిలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇప్పటికే చెత్తా చెదారంతో నిండి పోగా వాటిని ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాల్సిన యజమానులు పట్టించుకోవడం లేదు. పైగా కౌన్సిలర్లు, కార్పొరేటర్లపై ఒత్తిడి తీసుకొచ్చి బల్దియా కార్మికులతో చెత్తను శుభ్రం చేయిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు సైతం రాజకీయ ఒత్తిళ్లతో ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. నగరంలో మూడు వేలకు పైగా..

నగరంలో మూడు వేలకు పైగా ఖాళీ స్థలాలు ఉండగా అవన్నీ దుర్గంధభరితంగా ఉన్నాయి. అలకాపురికాలనీ, ఆదర్శనగర్, సుభాష్‌నగర్, కిసాన్‌నగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, ఖాన్‌పుర, దుర్గమ్మగడ్డ, హుస్సేనీపుర, అశోక్‌నగర్, లక్ష్మీనగర్, గాయత్రీనగర్, పోచమ్మవాడ, వావిలాలపల్లి, బ్యాంకుకాలనీ, కుర్మవాడ, సంతోష్‌నగర్, భగత్‌నగర్, కట్టరాంపూర్, కోతిరాంపూర్, గణేశ్‌నగర్ బైపాసు, తిరుమల్‌నగర్, విద్యానగర్, రాంనగర్, సప్తగిరికాలనీ, కొత్తయాస్వాడ, రేకుర్తి, హనుమాన్‌నగర్, రాంచంద్రాపూర్, వాసుదేవకాలనీ, టీఎన్‌జీవోఎస్ కాలనీ, అగ్రికల్చర్ కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్ ప్రాంతాల్లో వర్షాలకు నీరు నిలుస్తోంది. చిన్నపాటి చెరువులను తలపిస్తాయి.

హెచ్చరిక బోర్డులకే పరిమితం.. : ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకోవాలని ఆయా స్థలాల ఎదుట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా స్థల యజమానులు మాత్రం పట్టించుకోవడం లేదు. వారం రోజుల్లో శుభ్రం చేసి తెలపాలని, లేదంటే రూ.10 వేల జరిమానా వేస్తామని గతంలో బోర్డులు పాతినా పెడచెవిన పెట్టారు. ఇప్పటి వరకు నగరపాలక సంస్థ నయాపైసా జరిమానా విధించకపోవడంతో, స్థల యజమానులు కూడా పట్టింపులేని ధోరణిలో ఉన్నారు.

తెలంగాణ పురపాలిక చట్టం-2019 సెక్షన్ 161(1)ప్రకారం చర్యలు తీసుకునే వీలున్నా అధికారులు కదలడం లేదు. ఈ స్థలాలు విక్రయిస్తే రెట్టింపు లాభం వస్తుండగా కనీసం శుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచన మాత్రం చేయడం లేదు. హైదరాబాద్ తరహాలో ఇక్కడ కూడా మంత్రి హెచ్చరిస్తే తప్ప అవి శుభ్రం చేసుకునేలా కనిపించడం లేదు. పైగా వర్షాలకు నీరు నిల్వ ఉండటంతో డెంగీ, మలేరియా వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. పురపాలికలు, నగరపాలికలు, గ్రామ పంచాయతీల్లో సీజన్ ప్రారంభంలో బ్లీచింగ్ చల్లి చేతులు దులుపుకొంటారు. నీరు నిల్వ ఉన్న చోట వైద్యారోగ్య శాఖ సరఫరా చేసి గంబూసియా చేపలు వదులుతారు. ఫాగింగ్ యంత్రాలు ఉన్నా ఒక్కో కాలనీకి 15 రోజులకు ఒకసారి మాత్రమే వస్తాయి.

మార్పు వస్తేనే..దోమల కారణంగా పిల్లల నుంచి మొదలుకుంటే వృద్ధుల వరకు జ్వరాల బారినపడతారు. ఒక్కోసారి ఇంటిల్లిపాదీ జ్వరబాధితులుగా ఉంటుంటారు. ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, మురుగు కుంటలు, వర్షంనీరు నిల్వ ఉండటం.. ఇవన్నీ దోమల ఆవాసాలు.. ఎవరి ఇళ్లు వారే అని కాకుండా.. కాలనీవాసులు సమష్టి నిర్ణయం తీసుకొని ఖాళీ స్థలాలు శుభ్రం చేయిస్తే.. వాటి పెరుగుదల తగ్గుతుంది. అందరిలో చైతన్యం వస్తేనే వాటి నివారణ సాధ్యమవుతుంది.

నోటీసులు జారీ చేస్తాంఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉన్నట్లయితే గుర్తించి నోటీసులు జారీ చేసేలా ఆదేశాలిస్తాం. స్థల యజమానులు వాటిని శుభ్రంగా ఉంచుకోవాలి. వర్షం నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. - బి.శ్రీనివాస్, కమిషనర్, కరీంనగర్

## డీసీసీబీ ఏర్పాటులో జాప్యం

జగిత్యాల : కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా కేంద్రంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సేవలను కొత్త జిల్లాలకు విస్తరించేలా రెండేళ్ల కిందట ఏర్పాటుచేయ తలపెట్టిన ప్రాంతీయ కార్యాలయాలను కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా నెలకొల్పాల్సి ఉంది. ముందుగా ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటుచేసి తర్వాత కొత్త జిల్లాలవారీగా డీసీసీబీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు జిల్లా నుంచి కొందరు ప్యాక్స్‌ల అధ్యక్షులకు కరీంనగర్ డీసీసీబీలో సభ్యులుగా అవకాశం ఇస్తూ వచ్చారు. ప్రస్తుతం జిల్లాలో 15 బ్యాంకు శాఖలు పనిచేస్తుండగా జగిత్యాలలో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి రైతులు, సహకార సంఘాలకు సేవలను మరింతగా దరిచేర్చాలన్న నిర్ణయాన్ని తక్షణమే అమల్లోకి తేవాలి. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుచేసిన అనంతరం కొన్ని మాసాల్లో ప్యాక్స్‌లకు ఎన్నికలు జరిగిన అనంతరం డీసీసీబీలను కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు చేసినట్లయితే జిల్లాకు చెందిన ప్యాక్స్‌ల అధ్యక్షులతోనే డీసీసీబీ కార్యవర్గం ఏర్పాటవుతుంది. ప్రస్తుతం కరీంనగర్ డీసీసీబీ పరిధిలో జగిత్యాలలో బ్యాంకు ఉండగా దాని ఆవరణలోనే పాత భవనం కూడా ఉంది. ప్రస్తుతం డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఇక్కడే ఏర్పాటుచేసే వీలుంది, తదుపరి డీసీసీబీ ఏర్పాటుకు కూడా అనువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. డీసీసీబీ పరిధిలో ప్రస్తుతం రైతులకు పంట రుణాలు, టర్మ్ రుణాలు, దీర్ఘకాలిక, వ్యాపార రుణాలను ఇస్తుండగా చాలావాటికి కరీంనగర్‌లోని కేంద్ర కార్యాలయం నుంచి అనుమతి పొందాల్సివచ్చేది. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుతో సేవలన్నీ ఇక్కడే లభిస్తాయి.

కేంద్ర ప్రభుత్వం అయిదేళ్లలో 2 లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికో ప్యాక్స్ ఉండాలని తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోనూ ప్యాక్స్‌ల సంఖ్య పెరగనుంది. ప్యాక్స్‌ల ద్వారా 25 రకాల సేవలను అందించాలని కేంద్రం నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే 51 ప్యాక్స్‌లుండగా 385 గ్రామపంచాయతీల్లో కనీసం మరో 50 గ్రామాల్లో నూతనంగా ప్యాక్స్‌లను ఏర్పాటుచేసే వీలుండటం కర్షకులకు కలిసిరానుంది. డీసీసీబీ పరిధిలో ఖాతాదారులు, సేవలు పెరిగినట్లయితే నాబార్డు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు కూడా రైతులు, సహకార సంఘాలకు సులువుగా అందుతాయి. అన్నిసంఘాల పరిధిలో ధాన్యం, మక్కలను కొనుగోలు చేస్తుండగా జగిత్యాల, రాయికల్ తదితర సంఘాలు కేంద్ర ఎరువుల సంస్థ క్రిభ్‌కోలో రూ.50 లక్షల చొప్పున వాటాధనం చెల్లించి సాలీనా రూ.10 లక్షల డెవిడెండ్‌ను పొందుతున్నాయి. చాలాసంఘాలు రుణాల మంజూరీ, బ్యాంకింగ్ కౌంటర్లు, లాకర్లు, పెట్రోలు పంపులను నిర్వహిస్తుండగా విత్తనశుద్ధి ప్లాంట్లు, రైస్‌మిల్లుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాయి. నాబార్డు ద్వారా పలుసంఘాలకు రూ.20 లక్షల చొప్పున నిధులను అందించగా గోదాములను నిర్మించారు. ఈ నేపథ్యంలో డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు, ప్యాక్స్ కేంద్రాల సంఖ్యపెంపు, రైతులందరినీ సభ్యులుగా చేర్పించటం దీర్ఘకాలికంగా ఉపయుక్తంగా ఉండనుంది.

# గురిపెడితే విజేతలే..

దండేపల్లి : ప్రభుత్వం ఇప్పటికే గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో కొలువు సాధించాలనే లక్ష్యంతో నిరుద్యోగులు సాధన చేస్తున్నారు. ఇటీవల జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో కొలువుపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఇందులో నోటిఫికేషన్, పరీక్ష తేదీలను ప్రకటించింది. కొలువులు ఎన్ని ఉన్నా పక్కా ప్రణాళికతో కష్టపడితేనే విజయం వరిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. కొలువులకు ఎలా సన్నద్ధమవ్వాలో వివరాలతో కథనం.

ప్రణాళికతో చదవాలి పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. గత పరీక్ష ప్రశ్నపత్రాలను సాధన చేస్తే ఎలా చదవాలో తెలుస్తుంది. ఒక సబ్జెక్టు తీసుకుంటే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చదివితేనే ప్రయోజనం. దీనికి అనుగుణంగా ముందే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అవసరమైన పుస్తకాలు ముందే సమీకరించుకోవాలి. ఎప్పుడు ప్రకటన వచ్చినా కొలువు కొడతా అనే నమ్మకంతో చదువుతూనే ఉండాలి. తక్కువ ఉద్యోగాలు ఉన్నాయనే నిరాశకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చు. రీజనింగ్, అర్థమెటిక్, ఆంగ్లం, జనరల్ అవేర్‌నెస్, వర్తమాన వ్యవహారాలు (కరెంట్ ఎఫైర్స్) సాధన చేయాలి. ఇష్టారీతిన ఏదో ఒక పుస్తకం చదవకుండా తెలుగు అకాడమీతో పాటు పేరు పొందిన రచయితల పుస్తకాలు చదివితే ప్రయోజనం ఉంటుంది.

జాబ్ క్యాలెండర్..గ్రూప్-1, 2, 3తో పాటు ఇతర గజిటెడ్ అధికారులు, ఎఫ్‌బీఓ, ఇంజినీరింగ్, ట్రాన్స్‌కో విభాగంలో ఏఈఈ, సబ్ ఇంజినీర్లు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు, పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సింగ్ అధికారులు, ఫార్మాసిస్టులు, ఎస్సైలు, గురుకుల డీఎల్, సింగరేణిలో ఎగ్జిక్యూటివ్ పోస్టులు.. వీటి కోసం నోటిఫికేషన్ జారీ, పరీక్షల నిర్వహణ తేదీలు, విద్యార్హత తదితర వివరాలతో క్యాలెండర్ విడుదల చేశారు. నోటిఫికేషన్ ఈ ఏడాది అక్టోబరు నుంచి వచ్చే ఏడాది నవంబరు వరకు విడుదల చేయనున్నట్లు క్యాలెండర్‌లో పొందుపరిచారు.

గ్రూప్ ఉద్యోగం.. ఉన్నత శిఖరాలకు నాంది

ఇప్పటికే గ్రూప్-1, 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడటంతో చాలా మంది అర్హులైన వారు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా శిక్షణ తీసుకుంటున్నారు. ఇక్కడ కష్టపడి సాధిస్తే జిల్లా స్థాయి అధికారి నుంచి కన్ఫార్మ్‌డ్ ఐఏఎస్ పోస్టు వరకు వెళ్లే అవకాశముంది. అందుకే ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తేనే కొలువు సాధించవచ్చు.

మారుమూల ప్రాంతం నుంచి.. ఉత్తమ కొలువు సాధించి...

దండేపల్లి మండలం చింతపల్లికి చెందిన ఆకుల వెంకటేశ్ గ్రామీణ ప్రాంతంలోనే చదువుకుని ప్రణాళికాబద్ధంగా చదివారు. గ్రూప్-2, 1 ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2012లో గ్రూప్-2 ఉద్యోగానికి ఎంపికయ్యారు. 2017లో గ్రూప్-1 పరీక్ష రాసి ఎంపీడీఓగా నియమితులయ్యారు. మరోసారి గ్రూప్-1 పరీక్ష రాసి రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. పరీక్షలు తేలికగా తీసుకోకుండా ప్రారంభం నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని ఆయన తెలిపారు. సిలబస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తెలుగు అకాడమీ పుస్తకాలను చదివి సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా సాధన చేయాలని ఆయన సూచించారు.

ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తేనే విజయం

గతంలో పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను బాగా సాధన చేయాలి. అప్టిట్యూడ్, రీజనింగ్‌పై బాగా దృష్టి సారించాలి. సమయ పాలనతో చదవాలి. ఏ ఉద్యోగానికి ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు. పూర్తి సిలబస్ తెలుసుకుని సాధన చేయాలి. స్థానిక విషయాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు దినపత్రికలు కచ్చితంగా చదవాలి.వి.సనత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు, చెన్నూరు

సద్వినియోగం చేసుకోండి ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఆదిలాబాద్‌లో నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్ ఉద్యోగార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తోంది. అర్హత ఉన్నవారికి ఉచిత శిక్షణతో పాటు పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచుతాం. ఉపకార వేతనాలు అందిస్తున్నాం. ఇందులో శిక్షణ పొందిన యువకుల్లో 325 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అర్హులైన వారు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. జి.ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్ ఆదిలాబాద్

## విద్యుత్తు ప్రజావాణి.. వినియోగించుకోరేమి?

మంచిర్యాల : రాష్ట్రంలో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత.. విద్యుత్తు సంస్థలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో సంస్థను గాడిలో పెట్టేందుకు ఐఏఎస్ అధికారి వరుణ్‌రెడ్డిని సీఎండీగా నియమించింది. అందుకు తగ్గట్లుగా వినియోగదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు పిలుపునిచ్చారు. విద్యుత్తు ప్రజావాణి పేరుతో ప్రతి ఒకేచోట కాకుండా ఏఈ(సెక్షన్)స్థాయి నుంచి మొదలు ఏఏఓ, ఏడీఈ, డీఈ చివరగా ఎస్‌ఈ ఇలా అయిదు చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలో వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం పరిష్కారం కావడం గమనార్హం. కానీ ఆదరణ అంతంత మాత్రమే లభిస్తుంది. దీనికి ప్రచార లోపంతో పాటు స్వీకరణ సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం కారణాలుగా కనిపిస్తున్నాయి. ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండటం, ఎక్కువగా వస్తే ఉన్నతాధికారుల నుంచి ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో పలువురు అధికారులు ఫిర్యాదులు స్వీకరించకుండానే సమస్య పరిష్కరిస్తామని చెప్పి పంపిస్తున్నట్లు తెలుస్తోంది.

నిర్లక్ష్యం చేస్తే ఇబ్బంది ఫిర్యాదులు స్వీకరించకుండా పరిష్కరించడం మంచిదే అయినా.. నిర్లక్ష్యం చేస్తేనే వినియోగదారులకు ఇబ్బంది. సమస్య పరిష్కారం కానీ వ్యక్తి మరోసారి వచ్చినా గతంలో ఫిర్యాదు చేసినట్లు రుజువు ఉండదు. అధికారులు ఉద్దేశపూర్వకంగా కాకపోయినా ఒక్కో సమయంలో పని ఒత్తిడి దృష్ట్యా మరిచిపోయే అవకాశముంటుంది. ఫిర్యాదులు వస్తున్నాయని ఆందోళన చెందకుండా, తెలియని సమస్యలు బయట పడుతుంటాయనే ఆలోచనతో ప్రజావాణి నిర్వహించాలి. సమస్యల వినతులు స్వీకరించి పరిష్కార మార్గం చూపించాలి. అప్పుడే సేవలు మెరుగుపడతాయి. సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు అందుతుంది.

ఈ ప్రజావాణి ప్రారంభమైన నెలన్నర వ్యవధిలో జిల్లాలోని రెండు డివిజన్లలో అందిన ఫిర్యాదులు, పరిష్కారమైన సమస్యల వివరాలు ఇలా..

ఫిర్యాదు ఇస్తే పరిష్కారమే..

ప్రస్తుతం విద్యుత్తు ప్రజావాణి అధికారికంగా సోమవారమైనా విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం పేరుతో రోజూ ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విధానం మంచిదే అయినా వినియోగదారులు అసంతృప్తి చెందే అవకాశాలే ఎక్కువ. సంబంధిత అధికారి స్వీకరిస్తేనే సమస్య పరిష్కారమవుతుందనే భావన వారిలో ఉంటుంది. దీంతో మరే ఇతర సిబ్బందికి వినతి ఇచ్చి వెళ్లినా కొంత నిరాశతోనే వెనుదిరుగుతారు. శాఖ ప్రకటించిన విధంగా ప్రతి జిల్లాలోని సెక్షన్, సబ్ డివిజన్, ఈఆర్‌ఓ, డివిజన్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, సర్కిల్(జిల్లా)కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా అధికారులు అందుబాటులో ఉంటే ఈ ప్రజావాణికి ప్రయోజనం చేకూరుతుంది. ఇందులో ఫిర్యాదు ఇస్తే తక్షణ పరిష్కారం లభిస్తుంది. దీన్ని వినియోగదారులు గుర్తించి సమస్యను ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి.

# ఇదీ..టెయిల్ పాండ్ చరిత్ర




మణుగూరు : అడవిదేవులపల్లి మండల కేంద్ర శివారులో కృష్ణానదిపై టెయిల్‌పాండ్ (నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌కు 21 కిలోమీటర్ల దిగువన) నిర్మించారు. నల్గొండ- పల్నాడు జిల్లాల మధ్య నిర్మించిన ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పనులు 2006 జులై 3న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, విద్యుత్తుశాఖ మంత్రి షబ్బీర్‌అలీలు సాగర్ నుంచి శంకుస్థాపన చేశారు. 1978 నుంచి ప్రతిపాదనలకే పరిమితమైన ఈ ప్రాజెక్ట్‌కు మోక్షం కలగడానికి 39 ఏళ్లు పట్టింది. అప్పట్లో ఈ ప్రాజెక్ట్ చేపడితే రూ.60 కోట్లతో పూర్తయ్యేది. భవిష్యత్తులో ఎప్పటికైనా ఈ ప్రాజెక్ట్ నిర్మిస్తారనే ఆశాభావంతో నాగార్జునసాగర్‌లో ఏడు రివర్సబుల్ టర్బైన్లను ఏర్పాటు చేశారు. పీక్ అవర్స్‌లో 50 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. ఇంతటి ప్రాధాన్యం గల ప్రాజెక్ట్‌కు దిల్లీలోని పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ ఆరంభంలో రూ.464 కోట్లు నిర్మాణాలు పూర్తిచేసేలా డ్రాయింగ్ డిజైన్లు రూపొందించారు. 2014 జులైలో నిర్మాణం పూర్తయ్యేనాటికి వ్యయం రూ.958 కోట్లకు చేరింది.

**50 మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదక కేంద్రం నిర్మాణం**

టెయిల్‌పాండ్ ఆనకట్టతో పాటు అనుబంధంగా జెన్‌కో సంస్థ 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు జల విద్యుత్తు కేంద్రాలను నిర్మించింది. టర్బైన్లు, ప్రధాన దిగువ కాల్వ నిర్మాణం చేపట్టారు. భారీ యంత్ర పరికరాలను అమర్చారు. వీటితో 50 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. పవర్‌హౌజ్‌లోని రొటేటర్‌ను 150 ఆర్పీఎం (రెవల్యూషన్ ఫర్ మినిట్) వేగంతో తిప్పడంతో పూర్తి స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఇక్కడ తయారైన విద్యుత్తును పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పశర్లపాడు గ్రామంలోని 250 కేవీ సబ్‌స్టేషన్‌కు పంపుతారు.

ఇతర ప్రయోజనాలు

టెయిల్ పాండ్ ప్రాజెక్ట్ నుంచి తెలంగాణ ప్రజల తాగు నాటిని అందించే మిషన్ భగీరథ కోసం నీటిని ఉపయోగిస్తున్నారు. దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ అవసరాల కోసం నీటి వినియోగించుకోనున్నారు.ప్రాజెక్ట్ నిర్మాణంతో రిజర్వాయర్‌లో 8 టీఎంసీల నీరు నిలువ ఉంటుంది. ఇందులో టీఎంసీ నీటిని రివర్సబుల్ టర్బైన్ల ద్వారా తిరిగి సాగర్ జలాశయానికి పంపింగ్ చేస్తారు. దీనివల్ల నాగార్జునసాగర్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్తు ఉత్పాదనకు వినియోగించిన నీరు సముద్రం పాలు కాకుండా తిరిగి రిజర్వాయర్‌లోకి చేరుతుంది. దీనివల్ల సాగర్ దిగువ ప్రాంతాలైన కృష్ణాడెల్టాకే కాక తెలంగాణ ప్రాంతాలకు చెందిన రైతులకు మేలు కలుగుతుంది.

# శునకం.. నియంత్రణ కనం



నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికల్లో కుక్కల సంతతి నియంత్రణ చర్యలపై అధికారులు దృష్టిసారించడం లేదు. దీంతో శునకాల సంతతి పెరిగి.. వీధుల్లో ఆహారాన్వేషణకు వెళ్తూ ఎదురుపడిన ఒంటరి మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. ఓ వైపు శునకాల దాడులు పెరుగుతున్నా.. పాలకులు, అధికారులు మాత్రం జీవాల నియంత్రణ శస్త్రచికిత్సలు మాత్రం జరిపించడం లేదు.నార్కట్‌పల్లిలో పదిహేను రోజుల క్రితం పెంపుడు కుక్క ఓ వ్యక్తిపై దాడిచేసి ఎడమకాలిపై తీవ్రంగా కరిచింది. వీధి శునకాల్తే కాదు.. పెంపుడు శునకాలు కూడా ఇలా దాడులు చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పురపాలికల్లో ఇదీ పరిస్థితి

సూర్యాపేట పురపాలికలోని కుక్కల సంతతి నియంత్రణ కేంద్రంలో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. సూర్యాపేటలో 1624 కుక్కలుండగా వాటిలో 943 శునకాలను పట్టుకొని చికిత్స చేయించారు. జిల్లాలోని ఇతర పురపాలికల్లో కుక్కలను పట్టుకొని సూర్యాపేటకు తీసుకురావాల్సి ఉంది. ఒక్క శునకం చికిత్సకు రూ.2వేల వరకు ఖర్చు అవుతుండటం, రవాణా భారం ఇబ్బందిగా మారిందని పుర అధికారులు చెబుతున్నారు. భువనగిరిలోని కుక్కల నియంత్రణ కేంద్రం ఉంది. ఆలేరులో కలెక్టరేట్ ఆదేశాల మేరకు వారంలో ఓ సంస్థతో ఒప్పందం చేసుకోనున్నారు. యాదగిరిగుట్టలో ఓ సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు పుర అధికారులు తెలిపారు.

నల్గొండలోని కేంద్రంలో ఇప్పటి వరకు 3000 శునకాలకు శస్త్రచికిత్సలు చేశారు. మిర్యాలగూడలో చికిత్స ప్రక్రియ ప్రారంభించలేదు. హాలియాలో శస్త్రచికిత్స చేయించేందుకు ఓ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. త్వరలో చర్యలు చేపట్టనున్నారు. చిట్యాలలో స్వతంత్ర యానియల్ వెల్ఫేర్ సొసైటీతో వారంలో ఎంవోయూ కుదుర్చుకునే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం

శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట: శునకాలు ఎక్కువగా ఉన్న వార్డుల్లో సిబ్బందితో పట్టించి జమునానగర్‌లోని నియంత్రణ కేంద్రంలో పశువైద్యాధికారితో చికిత్సలు చేయిస్తున్నాం.ఇప్పటి వరకు 943 కుక్కలకు చికిత్సలు చేయించాం. మళ్లీ వార్డుల్లోని శునకాలను పట్టించి కేంద్రానికి తరలిస్తాం.

గత జులై 26న సూర్యాపేటలోని శ్రీరాంనగర్ బ్రాహ్మణ కల్యాణ మండపం పరిధిలో బయటకు వెళ్లిన బాలుడిపై కుక్కలు దాడిచేసి ఎడమ చేయిని తీవ్రంగా గాయపరిచాయి.

# పల్లెపాలనకు అప్పులు!




కౌటాల : జిల్లాలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలో నాలుగు వేల పైచిలుకు జనాభా ఉంది. సర్పంచుల పదవీకాలం ముగిసిన తరువాత ఫిబ్రవరి 2వ తేదీ నుంచి అన్ని పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో మోటార్ల మరమ్మతులు, బ్లీచింగ్ కొనుగోలు, వీధి దీపాల ఏర్పాట్లు, గ్రామంలో చెత్త సేకరణ ఇలా.. వివిధ పనుల కోసం ఆరు నెలల వ్యవధిలో రూ.3 లక్షల పైచిలుకు ఖర్చయింది. ఈ మొత్తంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. పంచాయతీలో పనిచేసే పంచాయతీ కార్యదర్శి సొంతంగా సదరు మొత్తం అప్పుచేసి గ్రామంలో పనులు చేపట్టారు. ఇదీ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి..దేశానికి పట్టుకొమ్మలు.. అన్న గాంధీజీ మాటలను ఆయా ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఏటా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం, ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు విడుదల చేస్తుంటాయి. దీంతోపాటు గ్రామాలే సొంతంగా ఇంటి పన్నులు, ఇతర వసూళ్లతో నిధులు సమకూర్చుకుంటుంటాయి. అయితే పెద్ద పంచాయతీల్లో ఒకరకంగా, చిన్నవాటిల్లో పూర్తిభిన్నంగా ఉంటుంటాయి. 500 జనాభా ఉన్న తండాలను గత ప్రభుత్వం పంచాయతీలుగా మార్చిన నేపథ్యంలో.. అవి నిధుల కోసం తండ్లాడుతున్నాయి. గతేడాది చివరలో జరిగిన శాసనసభ ఎన్నికల ముందునుంచే రాష్ట్ర నిధులు ఆగిపోవడం, కేంద్ర నిధులు కూడా వెనుకా ముందు వస్తుండటంతో.. పంచాయతీల్లో పాలకవర్గాలు చివరలో అత్యవసర పనులకు సర్పంచులు అప్పులు తెచ్చి మరీ పనులు చేపట్టారు. ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగిసింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనను అమలులోకి తెచ్చింది. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు పైసా నిధులు విడుదల చేయలేదు. గతంలో సర్పంచులు ఉండటంతో.. వారే అన్నీ చూసుకునే వారు. ప్రస్తుతం కార్యదర్శుల పైనే ఆ భారం పడింది.

జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు పాలన నిర్వహించేందుకు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో వారే సొంతంగా గ్రామాల్లోని ఆయా పనులకు డబ్బులు ఖర్చు చేస్తున్నారు. పంచాయతీల నిర్వహణ, మరమ్మతులు, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్, వీధి దీపాల ఏర్పాట్లు, తదితర వాటికి అప్పులు చేసి కొనసాగిస్తున్నారు. దీంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.15 కోట్ల వరకు

జిల్లాలోని చిన్న గ్రామ పంచాయతీల్లో ఒక్కో పంచాయతీ కార్యదర్శి ఆరు నెలల వ్యవధిలో రూ.50 వేల వరకు ఖర్చుచేయగా.. మేజర్ పంచాయతీలలో కార్యదర్శులు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల పైచిలుకు అప్పులు చేసి పంచాయతీల పనులకు ఖర్చుచేశారు. మొత్తంగా చూస్తే 335 పంచాయతీల్లో దాదాపుగా రూ.15 కోట్ల వరకు నిర్వహణకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

నిధుల కొరతపై నివేదించాం

భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. అత్యవసర పరిస్థితుల్లో కార్యదర్శులే సొంతంగా డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయంపై జిల్లా యంత్రాంగానికి నివేదించాం. నిధులు మంజూరైతే ఇబ్బందులు తొలగుతాయి.

గ్రామ పంచాయతీలు - 335

పంచాయతీ కార్యదర్శులు - 240

ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు - 63

# మే..మే..మేసేశారు..!

హైదరాబాద్ : కులవృత్తులను ఆదుకునేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటివరకు వచ్చిన ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు చేస్తున్నా.. వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన లబ్ధిదారులు చెబుతున్నారు.

అధికారులు కమీషన్ల రూపంలో రూ.లక్షలు తీసుకున్నారంటూ ప్రజావాణి ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లకుండా తొక్కిపెడుతున్నారు. రెండు జిల్లాల్లో యూనిట్ల కు 25 శాతం డబ్బులు కట్టినా ఇప్పటివరకు గొర్రెలు అందించలేదు. పైగా కొందరు అధికారులు రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు కమీషన్లు తీసుకున్నారని చెతున్నారు. దీనిపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పందించాలని కోరుతున్నారు.

దళారులు... బినామీలు.. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఇప్పటివరకూ జరిగిన గొర్రెల పంపిణీలో కొన్ని సందర్భాల్లో మాత్రమే అధికారులు లబ్ధిదారులతో మాట్లాడారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి గొర్రెలను తరలించడం వరకు దళారీలే కీలకపాత్ర పోషించారు. వీరు గొర్రెలు విక్రయించిన రైతులకు డబ్బులు సక్రమంగా ఇవ్వకుండా బినామీ



ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు లక్షల యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశామంటూ అధికారులు చెబుతుండగా... ఇందులో 30 శాతానికిపైగా యూనిట్లు ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్ జిల్లాల్లో పంపిణీ చేశారు. గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా? లేదా? అని పరీక్షించి నివేదికలు ఇవ్వాల్సిన వైద్యుల్లో కొందరు రూ.1.20 కోట్లు కమీషన్ తీసుకున్నారని అంటున్నారు. స్పందించని ఉన్నతాధికారులు... గొర్రెలు విక్రయించిన రైతుల్లో కొందరు కొనుగోలు చేసిన యూనిట్లకు డబ్బు రాలేదంటూ రెవెన్యూ, పశుసంవర్ధక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

## అదును దాటుతోంది.. నారు ముదురుతోంది

భైంసా : వానాకాలం పారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇంకా చాలా చోట్ల చెరువులకు నీరు రాక వెలవెలబోతున్నాయి. మొదట్లో అక్కడక్కడ ఒకటి రెండు భారీ వర్షాలు కురిసినా వాటితో వరదలు అంతంత మాత్రమే రావడంతో చెరువులు నిండని పరిస్థితి. గత పక్షం రోజులుగా అడపాదడపా ముసురు వర్షం కురుస్తున్నా చెరువులకు నీటిని అందించే వాగులు, వంకలు పారడం లేదు. ఫలితంగా నీటివనరులకు నీరు చేరడంలేదు. దీంతో చెరువులు నిండుతాయనే ఆశతో జూన్‌లోనే వరి నార్లు పోసుకున్న రైతులు సాగుపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నార్లు వేసి రెండు నెలలు గడవడంతో ముదిరిపోతున్నాయి. నాటు వేసే అదును దాటుతుండడం తో దిగుబడి రాదని దిగులుతో ఉన్నారు. చెరువులపై ఆధారపడ్డ రైతులే కాదు.. బోరు మోటార్లపై సాగు చేసే రైతులు సైతం అదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటడం, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలతో పొలాల్లో నీరు నిండక ట్రాక్టర్ దమ్ముచక్రాలకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగోలా కొందరు



రైతులు బోర్ల మోటార్ల కింద వరినాట్లు వేస్తున్నారు. జిల్లాలోని భైంసా డివిజన్‌లోనే ఈ పరిస్థితి ఎక్కువ కనిపిస్తోంది. ఇప్పటికీ చెరువుల కింద ఆయకట్టుకు నీరు లేక నాట్లకు నోచుకోలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో వరి సాగు వివరాలు

వరి సాగు లక్ష్యం: 1.10 లక్షల ఎకరాలు

పంపుసెట్ల ఆధారంగా : 65వేల ఎకరాలు

సాగు నీటి వనరులు కింద: 45వేల ఎకరాలు

నాటు దగ్గరగా వేసుకోవాలి:

అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్

నారు ముదిరితే పైన మొనలు తుంచి నాటు దగ్గరగా వేసుకోవాలి. రెండుసార్లు వినియోగించే ఎరువుల్లో మోతాదును తగ్గించి మూడుసార్లు వేయాలి. మొనలు తుంచేయడం ద్వారా కాండాన్ని ఆశించే కీటకాలు తొలగిపోతాయి.


## దారి కష్టాలు దాటేదెప్పుడో?

మామడ : ఓ వైపు నాలుగు వరసల రహదారులు, సెంట్రల్ లైటింగ్‌తో పట్టణాలు, పెద్ద గ్రామాలు తళుక్కుమని మెరిసి పోతున్నాయి. మరో వైపు వాగు వంకలు దాటలేక, సక్రమమైన దారి లేక జనాలు అవస్థలు పడుతున్నారు. మారుమూలన, దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఉన్న గోండుల 'దారి కష్టాలను' దాటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.ఇదిగో బురద చూడండి..బురదలో కాలి నడకన అవస్థలు పడుతున్న ఈ గోండులది మామడ మండలం రాంపూర్. వీరికి రోడ్డు సౌకర్యం లేక ఎప్పుడూ ఇలా ఇబ్బంది పడుతుంటారు. ఆ ఊరు నుంచి మూడు కి.మీ. దూరంలో ఉన్న వాస్తాపూర్ వరకు రహదారి నిర్మిస్తే వా(దా)రి కష్టాలు గట్టెక్కుతాయి. మల్కాపూర్, పులిమడుగు వాసులనూ వాగులూ వంకలు దాటనివ్వట్లేదు.గమ్యం చేరేదెలా ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండలంలోని పలు గ్రామాల్లో జనాలను వాగులు దాటనివ్వడం లేదు. కడెం వాగుపై నిర్మించిన వంతెన రెండేళ్ల క్రితం భారీ వరదలకు కొట్టుకుపోవడంతో పసుపుల, హరిచంద్ తండా, దయ్యాలమద్ది, తులసిపేట, గట్టుగూడెం వాసులు అవస్థలు పడుతున్నారు. వంతెనను మళ్లీ నిర్మిస్తే తోవ ఇబ్బందులు తొలగుతాయి.ఇదే మండలం దొత్తి వాగుపై నూతనంగా వంతెన కడితే గుమ్మెన ఎంగ్లాపూర్, వస్‌పల్లి, దోందరి గ్రామాల వారికి రాకపోకలు సాఫీగా సాగుతాయి.

# ఓఆర్‌ఆర్ వరకు మురుగు శుద్ధి

హైదరాబాద్: అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన స్థానిక సంస్థలు (యూఎల్‌బీ)ల్లో మురుగు శుద్ధికి మార్గం సుగమం అయింది. గ్రేటర్ నుంచి ఓఆర్‌ఆర్ మధ్య 39 మురుగు శుద్ధి కేంద్రాల(ఎస్టీపీలు) నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రూ.3,849.1 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. అమృత్ 2.0 పథకంలో కేంద్రం 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 35 శాతం, హైబ్రిడ్ యాన్యుటీలో 40 శాతం నిధులు వెచ్చించనున్నారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఈ 40 శాతం నిధులు తొలుత భరించాలి. ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్ణీత కాల వ్యవధిలో ప్రభుత్వం వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తుంది. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా చేపడుతున్న 31 ఎస్టీపీలను ఈ విధానంలోనే చేపడుతున్నారు. అవుటర్ రింగ్‌రోడ్డు పరిధిలో నిర్మించే మురుగు శుద్ధి కేంద్రాలకు సంబంధించి జలమండలి మరోసారి ఇదే విధానం ఎంచుకుంది. ఇందులో ఒక ప్రాజెక్టును మాత్రం రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపడతారు.మూసీ ప్రక్షాళనలో భాగంగా..

972 మిలియన్ లీటర్ల శుద్ధి సామర్థ్యంతో కొత్త ఎస్టీపీలను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే అక్టోబరు నాటికి నగర వ్యాప్తంగా ఇప్పటికే



ప్రారంభించిన 31 ఎస్టీపీల్లో మురుగు శుద్ధి ప్రారంభం కానుంది. దీనికి మరో 1,250 మిలియన్ లీటర్లు అదనంగా శుద్ధి చేయనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 2,000 మిలియన్ లీటర్ల వరకు నిత్యం మురుగు ఉత్పత్తి అవుతుండగా...పాత, కొత్త ఎస్టీపీలతో కలిపి 100 శాతం మురుగు శుద్ధి సాధ్యం కానుంది. ప్రస్తుతం ఎస్టీపీల్లో శుద్ధి చేయని మురుగులో 80 శాతం మూసీలో కలుస్తుండగా...మరో 20 శాతం స్థానిక చెరువుల్లోకి చేరుతోంది. ఫలితంగా గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువులు కలుషితమయ్యాయి. ఇలాంటి పరిస్థితిలో మూసీని ప్రక్షాళన చేయడం సవాలే. ప్రతి మురుగు చుక్కను శుద్ధి చేశాకే మూసీలోకి విడిచిపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అవుటర్ పరిధిలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఉత్పత్తి అయ్యే మురుగును కొత్త ఎస్టీపీల్లో శుద్ధి చేస్తారు. అనంతరమే మూసీలోకి విడిచిపెట్టనున్నారు. త్వరలో వీటికి సంబంధించిన టెండర్లను పిలవనున్నట్లు జలమండలికి చెందిన ఓ అధికారి తెలిపారు.

# పసిగట్టేస్తాం.. పట్టేస్తాం

హైదరాబాద్: పోలీసులకు సవాలుగా మారుతోన్న సైబర్ నేరాలను మరింత సమర్థంగా ఎదుర్కోవడానికి సైబరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. కొత్తగా ఐదు సైబర్‌క్రైమ్ ఠాణా ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కమిషనరేట్ పరిధిలో జోన్‌కు ఒకటి చొప్పున ఉండేలా కసరత్తు చేస్తున్నారు.ఆమోదం లభించాల్సి ఉంది.

జోన్ల కేంద్రంగా పరిష్కారం

ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఒక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఉంది. రూ.50 వేల కంటే తక్కువ పోగొట్టుకుంటే స్థానిక స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. అంతకుమించి అయితే సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఈ ఠాణాలో 2024లో ఇప్పటివరకూ 4935 కేసులు నమోదయ్యాయి.

డబ్బు రికవరీ సగటున 20 శాతం మించడం లేదు.

నేరస్థుల అరెస్టులు సగటున 5 శాతం కూడా ఉండడం లేదు.

ఇతర రాష్ట్రాల్లో ఉండే నిందితుల్ని తీసుకురావడానికి వారాల తరబడి పనిచేయాల్సి వస్తోంది.

కేవలం ఒకే పోలీస్‌స్టేషన్ ఉండటంతో ఈ సమస్య వస్తోంది.

జోన్‌కి ఒకటి చొప్పున సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఉంటే.. సగటు కేసుల పరిష్కారం పెరిగే అవకాశముంటుంది.

పెరుగుతున్న కేసులు



రాష్ట్రంలో అత్యధికంగా సైబర్ నేరాలు నమోదయ్యే పోలీస్ యూనిట్లలో సైబరాబాద్ కమిషనరేట్ తొలిస్థానంలో ఉంది. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రానికి కీలకమైన ఐటీ కారిడార్‌తో పాటు అంతర్జాతీయ సంస్థలు సైబరాబాద్ పరిధిలో ఉన్నాయి. వీటికితోడూ వివిధ రాష్ట్రాలకు చెందిన ఐటీ సంస్థలూ ఇక్కడే ఉంటున్నాయి. ఫలితంగా కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. సైబరాబాద్‌లో 2023లో మొత్తం 5,342 కేసులు నమోదైతే.. ఈ ఏడాది తొలి ఏడునెలల్లోనే ఒక్క సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లోనే 4,935 కేసులు నమోదయ్యాయి. స్థానిక పోలీస్‌స్టేషన్లలో రూ.50 వేల కంటే తక్కువ మొత్తాల్లో పోగొట్టుకున్న ఘటనల్లో నమోదయ్యే కేసులు అదనం. ఈ ఏడాదిలోపు ఈ సంఖ్య రెట్టింపయ్యే అవకాశముంది. ప్రస్తుతం రోజూ 24 కేసులు నమోదవుతున్నట్లు గుర్తించారు.

# పంట రుణం.. లక్ష్యానికి దూరం



హుజూరాబాద్ : ఉమ్మడి జిల్లాలో ఏటా వార్షిక రుణ ప్రణాళికను భారీగా ఖరారు చేస్తున్నా లక్ష్యానికి అనుగుణంగా రైతులకు అందటం లేదు. గత నాలుగేళ్ల గణాంకాలను పరిశీలిస్తే 72 శాతానికి మించి రైతులకు రుణాలు ఇచ్చిన దాఖలలు లేవు. ప్రతీ సీజన్‌లో రుణాల మంజూరులో బ్యాంకు అధికారులు కొర్రీలు పెడుతుండంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీంతో వారిపై వడ్డీ భారం పడుతోంది. పంట రుణమాఫీ చేస్తారనే ఆశతో రైతులు తమ బ్యాంకు ఖాతాలను రెన్యూవల్ చేసుకోలేదని.. అందుకే రుణాల లక్ష్యం పూర్తి కాలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. గత నాలుగేళ్ల పంట రుణాల వార్షిక ప్రణాళిక లక్ష్యం.. ఇచ్చిన రుణాలపై కథనం.

**ఖాతాలు పునరుద్ధరించుకోకపోవడంతో..**

గత నాలుగేళ్లలో రుణ లక్ష్యాలు పరిశీలిస్తే ఈ ఏడాదైనా పూర్తవుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రుణాలు అందక రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ లాభాలు రాక.. అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,30,709 మంది రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేశారు. జులై 30న రూ.లక్షన్నర వరకు రుణమాఫీ నిధులు విడుదలయ్యాయి. ఆగస్టు 15న రూ.2 లక్షల వరకు రుణమాఫీ రైతులకు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా కొత్త రుణాలు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. మరోవైపు నాబార్డు లక్ష్యాలకు అనుగుణంగా నిర్దేశించిన మేర రైతులకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. రుణమాఫీ పొందిన రైతులు తమ ఖాతాలను రెన్యువల్ చేసుకుని కొత్త రుణాలను పొందవచ్చని బ్యాంకు అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో బ్యాంకర్లు కొత్త రుణాలను మంజూరు చేస్తారనే ఆశలు అన్నదాతల్లో చిగురిస్తున్నాయి. ఈ ఏడాది లక్ష్యం రూ.8,034.26 కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో 12.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నాబార్డు లక్ష్యాల మేరకు రూ.8,034.26 కోట్ల వార్షిక పంట రుణ లక్ష్యాన్ని అధికారులు ఖరారు చేశారు. వానాకాలం, యాసంగికి కలిపి(టర్మ్ లోన్స్ మినహా) కరీంనగర్ జిల్లాలో రూ.2,357.80 కోట్లు, జగిత్యాలలో రూ.2,292.60 కోట్లు, పెద్దపల్లిలో రూ.1,864.83 కోట్లు, సిరిసిల్లలో రూ.1,519.03 కోట్లు రైతులకు సాగు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు.

# ప్రగతి రథ చక్రం.. పర్యావరణ హితం



కరీంనగర్ : ఇంధన భారం తగ్గించుకోవడం, కాలుష్య నివారణతోపాటు ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతమున్న అద్దె బస్సుల తరహాలోనే ఎలక్ట్రికల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. జేబీఎం సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్టీసీకి ఇంధన భారం తగ్గనుంది. మరో వైపు మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సరిపడా బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎలక్ట్రికల్ బస్సులు రోడ్డు ఎక్కనుండటంతో వారికి కాస్త ఉపశమనం కలుగుతుంది. కరీంనగర్ రీజియన్‌లో ఎలక్ట్రికల్ బస్సుల సేవలపై కథనం.

రీజియన్‌లోని కరీంనగర్-2 డిపోకు 70 ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించారు. ఇప్పటికే మొదటి దశలో 33 కరీంనగర్‌కు చేరాయి. మిగతావి రెండో విడతలో వచ్చే అవకాశముంది. ప్రస్తుతం వచ్చినవన్నీ సూపర్‌లగ్జరీ బస్సులు కాగా రెండో దశలో ఎక్స్‌ప్రెస్‌లు రానున్నాయి. కరీంనగర్-2 డిపోలో ఎలక్ట్రికల్ బస్సులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్తు సబ్‌స్టేషన్ పనులు, షెడ్డు నిర్మాణం, బస్సుల ఛార్జింగ్ పాయింట్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. 14 ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తుండగా ఇప్పటికీ 11 పూర్తయ్యాయి. అవసరమైన విద్యుత్తు సరఫరాకు ఆర్టీసీ ఇప్పటికే ఆ శాఖకు దాదాపు రూ.6 కోట్లు చెల్లించినట్లు సమాచారం. ఒక్కో బస్సు ఫుల్ ఛార్జింగ్ కావాలంటే మూడు గంటల సమయం పట్టే అవకాశం ఉంటుంది. ఒక్కసారి ఛార్జి చేస్తే 320కి పైగా కిలోమీటర్లు నడుస్తుందని తెలిసింది. ఆర్టీసీ అద్దె (హైర్) బస్సుల తరహాలోనే వీటిని తిప్పనున్నారు. జేబీఎం సంస్థతో ఒప్పందం కూడా జరిగింది. డ్రైవరు, విద్యుత్తు ఛార్జీలు, నిర్వహణ మొత్తం సంస్థే చూసుకుంటుంది. ఆర్టీసీ ఆ సంస్థకు కిలోమీటరుకు రూ.39-40 వరకు చెల్లించనుందని సమాచారం. కేవలం కండక్టర్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులకు టికెట్లు ఇచ్చి డబ్బులు వసూలు చేసే బాధ్యత తీసుకుంటుంది. టిమ్మూ డ్రైవర్ అయితే ఎలా అనే వ్యవహరించాలనే విషయంలో మాత్రం ఇప్పటికీ స్పష్టత రాలేదు. కరీంనగర్-2 డిపోకు వచ్చిన ఎలక్ట్రికల్ బస్సులలో 75 శాతం వరకు జేబీఎస్, హైదరాబాద్ రూట్‌లోనే నడిపే అవకాశం ఉందని, మిగిలిన వాటిని ఛార్జింగ్ కెపాసిటీని బట్టి ఇతర ప్రాంతాలకు నడిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఛార్జింగ్ పాయింట్లు, ఇతర అవసరమైన పనులు పూర్తికాగానే ఈ నెల చివరలో కాని సెప్టెంబరు మొదటి వారంలో కాని ఎలక్ట్రికల్ బస్సులు రోడ్డెక్కే అవకాశం ఉందని సమాచారం.

త్వరలో ప్రారంభం

మొదటి విడతలో భాగంగా 30 ఎలక్ట్రికల్ బస్సులు కరీంనగర్ చేరుకున్నాయి. మిగితావి త్వరలో వచ్చే అవకాశముంది. కరీంనగర్-2 డిపోలో ఛార్జింగ్ పాయింట్లు, షెడ్డు నిర్మాణం పూర్తి కావచ్చింది. త్వరలోనే వీటిని ప్రారంభిస్తారు. కంపెనీయే నిర్వహణ బాధ్యత చూసుకుంటుంది. విధి విధానాలు రాలేదు.

ఎస్.సుచరిత, ఆర్‌ఎం, కరీంనగర్ రీజియన్

# అంతటా చేసి.. ఇక్కడ వదిలేసి!



కరీంనగర్ : నగరంలో స్మార్ట్‌సిటీ, ఇతర నిధులతో రహదారులను బాగు చేయగా, వాహనాలు రయ్‌మని దూసుకెళ్తున్నాయి. కానీ అత్యంత ప్రాధాన్య కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్ వైపు వెళ్లు అంతర్గత అనుసంధాన రహదారిని మాత్రం విస్మరించారు. అటు వైపు ప్రయాణం చేసేవారు నరకయాతన పడుతున్నారు. ప్రత్యామ్నాయ దారులు వెతుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రాంతం ఎక్కడ ఉంది.. చేయాల్సిన పనులేమిటి? తదితర వివరాలతో కథనం.సమస్య : నగరంలోని 60 డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించేందుకు ముఖ్యమంత్రి హామీ నిధులు(సీఎంఏ) రూ.132 కోట్లతో గతేడాది అక్టోబరులో పనులు అట్టహాసంగా ప్రారంభించారు. కొన్ని డివిజన్లలో పనులు పూర్తి చేయగా మిగతా ప్రాంతాల్లో తవ్వి వదిలేశారు. అసంపూర్తి పనుల్లో కట్టరాంపూర్- కోతిరాంపూర్ రహదారి కూడా ఒకటి. రెండు కిలోమీటర్ల పొడవునా చేపట్టాల్సిన పనులు సగం మేర పూర్తి చేసి మిగతా భాగం వదిలేశారు. రోడ్డు పూర్తయిన చోట డ్రైనేజీలు అసంపూర్తిగా ఉన్నాయి.

**ఇబ్బందులు ఇలా**

వదిలేసిన ప్రాంతంలో రహదారి మొత్తం ఛిద్రమైంది. వర్షం పడితే చాలు గుంతలలో నీరు నిలిచి రాకపోకలు సాగించకుండా మారుతోంది. రెండు వైపులా మురుగుకాలువలు అధ్వానంగా మారాయి. అసంపూర్తిగా ఉన్నాయి. పది నెలలుగా పనులు చేయకపోవడంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

**పని పూర్తయితే ప్రయోజనం**

భగత్‌నగర్, రాంపూర్ , దోబీవాడ, గణేశ్‌నగర్, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, కలెక్టరేట్ ప్రాంతం, ముకరంపుర తదితర కాలనీల నుంచి హైదరాబాద్ రోడ్డుకు వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఉపయోగపడుతుంది. అలాంటి రోడ్డుపై రాకపోకలు సాగించడం గగనంగా మారింది.

**ఫిర్యాదులు వస్తున్నా..**

కట్టరాంపూర్ వైపు రోడ్డు గుంతలు పడిందని ఆ ప్రాంతవాసులు, వివిధ రాజకీయ పార్టీలు ఫిర్యాదు చేస్తుండగా కనీసం పట్టింపులేకుండా పోయింది. నిత్యం రద్దీగా టెంపుల్ రోడ్డును నిర్మించకపోవడం పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతుంది. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.కట్టరాంపూర్ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభించే అవకాశముందని నగర పాలిక డీఈఈ ఓంప్రకాశ్ తెలిపారు. గుత్తేదారు వస్తే పనులు ఆగవు. రహదారి విస్తరణకు అడ్డంకులు ఉన్నాయన్నారు.

# విస్తరణ దిశగా.. జియో థర్మల్ ప్లాంట్!

మణుగూరు : మణుగూరులోని జియో థర్మల్ విద్యుదుత్పత్తి ప్లాంట్ విస్తరణపై కదలిక వచ్చింది. పగిడేరు గ్రామంలో 20 కేవీ సామర్థ్యంతో 2020లో కర్మాగారాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో మెగావాట్ల సామర్థ్యం గల స్థాయికి ప్లాంట్ రూపాంతరం చెందే అవకాశం ఉంది.

సహజ సిద్ధంగా పైకి ఉబికి వచ్చే వేడి నీటి బుగ్గల నుంచి వందల మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవకాశం ఉంది. దీనిపై పగిడేరులో సర్వే చేసేలా సింగరేణి, ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్), తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో) సంస్థల మధ్య తాజాగా ఒప్పందం కుదిరింది. ఫలితాలు సానుకూలంగా వస్తే వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తిని చేపట్టనున్నారు. అప్పటి వరకు ఓఎన్‌జీసికి సింగరేణి సంస్థ లాజిస్టిక్స్‌తో పాటు ఇతర సదుపాయాలు కల్పించనుంది. మరోవైపు 'రెడ్కో' సంస్థ ప్రభుత్వం నుంచి తగిన అనుమతులు తీసుకోనుంది. ప్లాంట్‌ను ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇంకా నిర్ణయానికి రాలేదు. విస్తరణ



జరిగితే మణుగూరు ప్రాంతం మరింత అభివృద్ధికానుంది.

**అనువైన వేడినీటి బుగ్గలు**

మణుగూరు పరిసర ప్రాంతాల్లోని భూమి పొరల్లో జియోలాజికల్ ట్రై జంక్షన్ కేంద్రీకృతమై ఉంది. భూమి పొరలలో రాపిడి వల్ల భూకంపాలు ఏర్పడటంతో పాటు వేడి నీరు ఉద్భవిస్తుంది. రేడియో యాక్టివిటీ మూలకాల కారణంగా ఆ నీటిలో ఉష్ణం మరింత పెరుగుతుంది. పగిడేరు ప్రాంతంలో ఇలాంటి వేడి నీటి ఊట 2 కి.మీ. లోతులో ఉందని ఓఎన్‌జీసీ గుర్తించింది. జియో థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు ఈ ప్రదేశం అనువైనదిగా పలు సర్వేల్లో తేల్చారు. 120 నుంచి 3400 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తి చేసేందుకు అనుకూలమైన ప్రదేశాలున్నాయని పలు పరిశోధన వ్యాసాల్లోనూ పేర్కొన్నారు. దీని ఆధారంగా ప్రాథమిక అంచనాకు వచ్చిన ఓఎన్‌జీసీ త్వరలో సర్వే చేపట్టనుంది.

“జియో థర్మల్ కేంద్రం ఏర్పాటుకు సింగరేణి నుంచి ఓఎన్‌జీసీకి పూర్తి సహకారం ఉంటుంది. సర్వేకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తాం. మణుగూరులో ప్లాంట్ విస్తరణకు అన్ని అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరిగితే భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం గ్రిడ్‌కు అనుసంధానించే అవకాశాలూ లేకపోలేదు.”దుర్గం రామచందర్, జీఎం, మణుగూరు

# తెరపైకి రాష్ట్రీయ రహదారి ప్రతిపాదన

మణుగూరు : బూర్గంపాడు-ఏటూరునాగారం రోడ్డును రాష్ట్రీయ రహదారిగా మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలోనే ప్రతిపాదనలు పంపి సర్వే చేసినా ప్రయత్నాలు ఫలించలేదు. కొత్తగా అంశం తెరపైకి వచ్చింది. భద్రాచలం క్రాస్‌రోడ్ నుంచి ఏటూరునాగారం వరకు సుమారు 92.9 కి.మీ రహదారిని రాష్ట్రీయ రహదారిగా మార్చనున్నారు. ప్రస్తుతం ఇది కోర్ రహదారిగా ఉంది. నాలుగు వరుసలుగా మార్చే అంశంపై ఆర్‌అండ్‌బీ శాఖ నివేదికలు పంపింది.

**1,500పైన ఉంటేనే...**

ప్రధాన రహదారిపై రోజుకి 1,500 పైగా వాహనాలు తిరిగితే రాష్ట్రీయ రహదారిగా మార్చే అవకాశం ఉంది. బూర్గంపాడు-ఏటూరునాగారం రహదారిపై అంతకుమించి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్యాసింజర్ కార్ యూనిట్స్(పీసీయూ) 12450, కమర్షియల్ వాహనాలు 2943 తిరుగుతున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

ఎంతో సౌలభ్యం.. నాలుగు వరుసల రహదారిగా మార్చితే ఎంతో సౌలభ్యం ఉంటుంది. సూర్యాపేట-హైదరాబాద్ రహదారిని జాతీయ రహదారిగా మార్చటంతో, హైదరాబాద్ వెళ్లే వాహనాలు ఏటూరునా



గారం మీద నుంచి కాకుండా సూర్యాపేట నుంచి వెళ్తున్నాయి. నాలుగు వరుసల రహదారిగా మార్చితే ఇతర ప్రాంతాలకు చెందిన వాహనాలు బూర్గంపాడు-ఏటూరునాగారం రహదారి మీదుగా వెళ్తాయి. దీంతో అశ్వాపురం, మణుగూరుతోపాటు మలుగు జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలు అభివృద్ధి కానున్నాయి. రానున్న రోజుల్లో సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌పై పర్ణశాల వెళ్లేందుకు వంతెన నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు వరుసల రహదారి మంజూరైతే అశ్వాపురం మీదుగా పర్ణశాల వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరగనుంది.

ప్రతిపాదనలు పంపాం - హరిలాల్, డీఈ ఆర్‌అండ్‌బీ

బూర్గంపాడు-ఏటూరునాగారం రహదారిని నాలుగు వరుసల రహదారిగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపాం. వాహనాల లెక్క ఇచ్చాం. గతంలో సర్వే చేసినా ఎటువంటి ముందడుగు లేదు.

# గంజాయి తాగితే పట్టేస్తుంది!


ఖమ్మం : గంజాయి రవాణా, వినియోగాన్ని నిర్మూలించడం ఆబ్కారీ, పోలీసుశాఖలకు సవాలుగా మారుతోంది. గంజాయి తాగి రోడ్డుమీద తిరిగేవారిని గుర్తించడం కష్టం. మద్యం తాగి వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు 'బ్రీత్ అనలైజర్' పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే గంజాయి తాగినవారిని గుర్తించేందుకు ప్రత్యేక కిట్లు వచ్చాయి. ఒక్కో పోలీసు స్టేషన్‌కు 5 నుంచి 10 గంజాయి పరీక్ష కిట్లను పంపిణీ చేశారు.పోలీసులు తనిఖీల సందర్భంగా పలువురు అనుమానితులను పట్టుకుంటారు. వీరిలో గంజాయి తాగారన్న అనుమానం ఉన్నవారిని వైద్య పరీక్షలకు పంపిస్తారు. ఫలితాలు రావడం ఆలస్యమవుతుంది. ఈ జాప్యాన్ని నివారించేందుకు 'ఎబాన్ డ్రగ్ యూరిన్ టెస్టు కిట్' ఉపయోగపడుతుంది. ఇది 12 రకాల మాదక ద్రవ్యాల గుట్టు విప్పనుంది. మద్యం తాగినవారికి మాదక ద్రవ్యాలు ఉపయోగించిన వారి ప్రవర్తనలో తేడా ఉంటుంది. పట్టుబడినవారిలో గంజాయి తీసుకున్నారనే అనుమానం వస్తే వారిని స్టేషన్‌కు లేదా సమీప ఆసుపత్రికి తీసుకెళ్తారు. వీరి మూత్రం చుక్క ఈ కిట్‌లో వేస్తే పాజిటివ్, నెగెటివ్ చూపిస్తుంది.

## అటవీ అనుమతులపైనే ఆశలు

సారంగాపూర్: బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు అంచనా విలువ రెట్టింపు అయినప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో నీటి నిలువ ప్రశ్నార్థకంగా మారింది. బీర్‌పూర్, ధర్మపురి మండలాల చివరి ఆయకట్టు వరకు నీరందించాలన్న ఉద్దేశంతో రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు 2016లో రూ.60 కోట్లతో టెండర్ ప్రక్రియ ప్రారంభమవ్వగా 2017లో ప్రారంభించారు. ఈ ఏడాది జూన్ వరకు పనులు పూర్తి చేసి ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో నీరందిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినప్పటికీ అటవీ శాఖ అభ్యంతరంతో ఇప్పటికీ తూములకు షట్టర్లు బిగించకపోవడంతో వరద నీరు బయటకు వెళ్లిపోతుంది. దీనికి తోడు గుత్తేదారు గడువు ఈ నెల చివరి వరకు మాత్రమే ఉండడంతో పనులు నిలిచిపోయే అవకాశముంది. ఇప్పటికే నాలుగు మార్లు గడువు పొడిగిస్తూ పనులు అప్పగిస్తుండగా మరోసారి గడువు పెంచితేనే పనులు చేపట్టే అవకాశముంది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో పనులు నిలిచిపోయి అక్టోబర్ వరకు ప్రారంభించే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెట్టింపైన అంచనా విలువ

ప్రాజెక్టు ఆధునికీకరణ చేపట్టే సమయంలో 0.25 టీఎంసీ నుంచి ఒక టీఎంసీ నీటిని నిలువ చేసేందుకు రూ.60 కోట్లతో ప్రారంభమైన పనులు ప్రస్తుతం రూ.153 కోట్లకు చేరుకుంది. అయినప్పటికీ అటవీ



అనుమతులు రాకపోవడంతో ప్రాజెక్టు మూడు తూములకు షట్టర్ల బిగించకపోవడంతో గేజేదీ నుంచి వచ్చిన వరద నీరు వచ్చినట్టు వెళ్లిపోతోంది. దీంతో నీటి నిలువ సామర్థ్యం లేకపోవడమే కాకుండా ప్రాజెక్టు ఎగువన ఉన్న బుగ్గ చెరువు ప్రాంత రైతులకు నీరు వెళ్లడం కష్టంగా మారింది. గేజేదీ తూములో బండరాళ్లు అడ్డుగా వేసి నీటిని అందించారు. గతంలో ప్రాజెక్టు నిలువ సామర్థ్యం 0.25 టీఎంసీ ఉన్నందున ఆ మేరకు నీటిని నింపుకునే అవకాశముందని దీని ఆధారంగా షట్టర్లు బిగిస్తారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంబంధిత అటవీ అధికారులకు వివరించారు. దీనికి అభ్యంతరం లేకపోవడంతో షట్టర్లు బిగించాల్సి ఉన్నప్పటికీ గుత్తేదారు పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో మళ్లీ షట్టర్లు బిగించడం ఇబ్బందిగా మారనుంది. భూముల అప్పగింతలో జాప్యం

ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న 864 ఎకరాల అటవీ భూమికి బదులుగా ఇతర ప్రాంతాల్లో రెవెన్యూ భూములను అప్పగించాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు భూములను అప్పగించడంలో జాప్యం చేయడంతో అటవీ అధికారులు తరచూ పనులను అడ్డుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని పెగడపల్లి, నంచర్ల, ల్యాగలమర్రి తదితర ప్రాంతాల్లో రెవెన్యూ భూములు పరిశీలించినప్పటికీ స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు. రెవెన్యూ శాఖ భూములు అప్పగించడం త్వరగతిన పూర్తి చేసినప్పుడే ప్రాజెక్టులో టీఎంసీ సామర్థ్యం నిలువ చేసే అవకాశముంటుంది.

షట్టర్లు బిగించేలా చర్యలు

– చక్రునాయక్, ప్రాజెక్టు డీఈఈ

ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కేవలం ప్రాజెక్టు మూడు తూములకు షట్టర్లు బిగించాల్సి ఉంది. ఇందుకు పనులు పూర్తి చేసేలా గుత్తేదారుపై ఒత్తిడి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. అటవీ శాఖ అనుమతి రాకపోవడంతో 0.25 సామర్థ్యం మేరకు నీటిని నిలువ చేసుకునేలా చూస్తున్నాం. అటవీ శాఖ అనుమతి రాగానే టీఎంసీ నిలువ చేసేలా చర్యలు తీసుకుంటాం.

## యథేచ్ఛగా మట్టి రవాణా

సుల్తానాబాద్: ఓ సామాన్య రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ఎత్తుగా ఉన్న భూమిని తవ్వుకొని చదును చేసుకునేందుకు అనేక కారణాలు చెప్పి అడ్డుకునే పలుశాఖల అధికారులు ప్రభుత్వ, పరంపోగు భూముల్లో, చెరువుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల శివారులోని పరంపోగు భూముల్లో, రేగడి మద్దికుంట గ్రామ చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతూ అక్రమార్కులు రూ.లక్షల్లో దండుకుంటున్నారు. అయినా సంబంధితశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నీలగిరి వనంలో..

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల శివారు పరంపోగు భూములను గతంలో ప్రభుత్వం ఎస్సీలకు కేటాయించింది. ఆ భూముల్లో వారు నీలగిరి చెట్లు పెంచుకొని కొంత ఆదాయం పొందుతున్నారు. ఆ భూములు కాస్తా ఎత్తుగా ఉండి నీరు పారక.. సాగు వినియోగానికి దోహదపడటం లేదు. దీన్ని అదనుగా చేసుకున్న మట్టి అక్రమ రవాణాదారులు ఆ భూముల్లో రాత్రిబంవళ్లు మట్టిని తరలిస్తూ దండుకుంటున్నారు. సెలవు, పండగ దినాలు, రాత్రి సమయాల్లో అధికారులు అందుబాటులోలేని సమయం చూసి మరీ తవ్వకాలు చేపడుతూ మట్టిని



తరలిస్తున్నారు. రేగడి మద్దికుంటలో..రేగడి మద్దికుంట గ్రామ చెరువులో మట్టి తవ్వకాల అనుమతుల పేరున గుత్తేదారుడు అధికలోతుగా, గోతులుగా మట్టిని తవ్వుకొని సుద్దాల నుంచి రేగడి మద్దికుంటకు కొత్తగా నిర్మిస్తున్న రహదారి నిర్మాణానికి వాడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తమ గ్రామ అవసరాలకు మట్టి పోయకుండా మట్టిని తరలించుకుపోతు న్నారని పేర్కొంటూ ఇటీవలే గ్రామస్థులు మట్టి టిప్పర్లను కూడా అడ్డుకోవడం గమనార్హం. ప్రభుత్వ, పరంపోగు, చెరువు, కుంటల్లో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకోవాల్సిన పలుశాఖల అధికారులు తమ పరిధి కాదంటే తమది కాదని చేతులు దులుపుకొం టున్నారని, దీంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోతోందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు సమన్వయంతో మట్టి అక్రమ దందాను అడ్డుకోవాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటాంమట్టి అక్రమ తవ్వకాలు, రవాణా చేపడితే పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటాం. మట్టి తవ్వకాలకు సంబంధితశాఖ అధికారుల నుంచి తప్పక అనుమతులు తీసుకోవాలి.

– మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్

# రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుపై అధ్యయనం




సిరిసిల్ల : ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చడంలో కీలకమైంది స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ. దీని ద్వారా రాబడులు పెంచుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల ఫీజు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సబ్ రిజిస్ట్రార్ల వద్ద ఉన్న మార్కెట్ విలువ ఆధారంగా ఆయా మండల కేంద్రాలు, పంచాయతీలు, పురపాలికల్లో వాస్తవంగా ఎంత ధర పలుకుతుందనే విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో ఇంటి మార్కెట్ ధరలు ఎలా ఉన్నాయి, ఇంటి నంబర్లతో సహా వివరాలు సేకరిస్తున్నారు. వీటన్నింటిపై ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్‌లో సబ్ రిజిస్ట్రార్లు అందరికీ జోనల్ స్థాయి సమీక్ష సమావేశం జరుగుతుంది. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల పైన ప్రభుత్వానికి పంపాల్సిన వివరాలు, అలాగే ధరల నిర్ణయంపై అభ్యంతరాల స్వీకరణపైన చర్చించనున్నారు. ఈ ప్రక్రియలన్నీ పూర్తయ్యాక ఆగస్టు 1 నుంచి పెంచిన ధరలు అమలులోకి వస్తాయి.

ఇదీ పరిస్థితి

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.50 కోట్ల మేరకు ఆదాయం వస్తోంది. పెరగనున్న ఛార్జీలతో రాబడి కూడా పెరుగుతుంది. 2021 వరకు మార్కెట్ విలువపై రిజిస్ట్రేషన్ ఫీజు 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచారు. వ్యవసాయ భూములకు ఎకరానికి కనీస ధర రూ.75 వేలు, ఖాళీ స్థలాలకు చదరపు గజం చొప్పున, నివాసాలకు చదరపు అడుగు చొప్పున కనీస ధర నిర్ణయించి మార్కెట్ విలువ పెంచారు. ప్రస్తుతం సిరిసిల్ల, వేములవాడ పురపాలికల పరిధిలో ప్లాట్లు చదరపు గజం కనిష్ఠంగా రూ.1,780 నుంచి రూ.2,500 వరకు ఉంది. అదే గ్రామీణ ప్రాంతాల్లో గజం రూ.800 నుంచి రూ.3,000 వరకు ఉంది.

సిరిసిల్ల రెండో బాహ్యవలయ రహదారి చంద్రంపేట, రగుడు ప్రాంతంలో చదరపు గజం మార్కెట్ విలువ రూ.2 వేలు ఉంది. ఇక్కడ వంద గజాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటే రూ.2లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలి. కాగా బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం చదరపు గజం 20 వేలు. అంటే వంద గజాలకు రూ.20 లక్షల వరకు పలుకుతుంది. ఇలా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని ప్రభుత్వ మార్కెట్ విలువ, స్థానికంగా జరుగుతున్న క్రయ, విక్రయాల ధరలపైనాపూర్తిగా అధ్యయనం చేయనున్నారు. పురపాలికల్లోని స్థిరాస్తి ప్రభావం గ్రామాల్లోని వ్యవసాయ భూములకు పాకింది. దాంతో తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లో రియల్ వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది.

వ్యవసాయ భూముల విక్రయాలపై దృష్టి

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నెలకు సగటున వెయ్యి నుంచి 1,300 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరుగుతాయి. వీటి ద్వారా సుమారు రూ.4.50 కోట్ల ఆదాయం వస్తోంది. అలాగే ఒక్కో తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీనిలో వీర్నపల్లి, రుద్రంగి మండలాల్లో తక్కువగా ఉంటాయి. ఎల్లారెడ్డిపేట, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో ఎక్కువ. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండలాల్లో లేఅవుట్లు లేకుండానే గుంట, రెండు గుంటల చొప్పున వ్యవసాయ భూములను విక్రయిస్తున్నారు. దీనివల్ల చాలా ఏళ్లుగా ప్రభుత్వానికి రాబడి పడిపోతుందన్న అభిప్రాయం ఉంది. భవిష్యత్తులో నివాస స్థలంగా మార్చుకోవాలనుకునేవారు వ్యవసాయ భూములు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు విక్రయదారులు లేఅవుట్ లేకుండా, వ్యవసాయేతర భూమిగా మార్పిడి పన్ను (నాలా) చెల్లించకుండా విక్రయిస్తున్నారు. ఇలాంటి లావాదేవీల నుంచి రాబడి పెంచుకోవాలన్న ఆలోచనలో రిజిస్ట్రేషన్ శాఖ ఉంది. కాగా ప్రభుత్వం సేకరించే వివరాల్లో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ విలువ ఎంత? ప్రస్తుత ప్రభుత్వ విలువ ఎంత? అనే కోణంలోనూ వివరాలు సేకరిస్తున్నారు.

# కేటాయించని నిధులు.. పూర్తికాని పనులు



బోయినపల్లి : వాహనదారులకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు రాజన్న సిరిసిల్ల–కరీంనగర్ జిల్లాల ప్రధాన రహదారిలో కొదురుపాక నుంచి నర్సింగాపూర్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం చేపట్టారు. పలు చోట్ల రహదారి ఎత్తు బాగా పెరిగింది. మట్టి కొట్టుకుపోకుండా రాతి కట్టు (బండరాళ్లు పేర్చడం), రెయిలింగ్ పనులు చేపట్టాల్సి ఉన్నా విస్మరించారు. చిరు వర్షాలకే రహదారి అంచులు కోతకు గురవుతున్నాయి.

రాజన్న సిరిసిల్ల– కరీంనగర్ ప్రధాన రహదారిలో వాహనదారులకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు కొదురుపాక చౌరస్తా నుంచి నర్సింగాపూర్ స్టేజి వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం గతంలోనే నిధులు విడుదల చేసింది. కొదురుపాక చౌరస్తా నుంచి వెంకట్రావుపల్లి శివారులోని మధ్యమానేరు ఎడమ కాలువ వరకు ఒక భాగం, అక్కడి నుంచి నర్సింగాపూర్ వరకు మరో భాగంగా పనులు చేపట్టారు. రహదారి నిర్మాణం కోసం రూ. 20.45 కోట్లు కేటాయించారు. కొదురుపాక నుంచి నర్సింగాపూర్ స్టేజి వరకు పూర్తి చేశారు. వెంకట్రావుపల్లి శివారులోని మధ్యమానేరు ఎడమ కాలువ వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వెంకట్రావుపల్లి వద్ద డివైడర్ పనులు పూర్తి కావాల్సి ఉంది. రహదారి నిర్మాణంతో వాహనదారులకు మెరుగైన రవాణా సదుపాయం ఏర్పడింది.బండరాళ్లు పేర్చకపోవడంతో...

కొదురుపాక చౌరస్తా నుంచి నర్సింగాపూర్ వరకు చేపట్టిన నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో పలు చోట్ల రహదారి ఎత్తు అధికంగా ఉంది. రహదారి ఎత్తుగా ఉన్న చోట మట్టి కోతకు గురికాకుండా ఉండటానికి రాతి కట్టు (బండరాళ్లు పేర్చడం) చేపట్టాల్సి ఉంది. దీంతోపాటు వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు రెయిలింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి మట్టి కోతకు గురైంది. అందులో విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. మట్టి కోతకు గురవడం వల్ల తారు రోడ్డు కూడా క్రమంగా కోతకు గురై కొట్టుకుపోయే అవకాశం ఉంది. వీటితోపాటు రహదారి డివైడర్ మధ్యలో లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. రాత్రి సమయంలో వాహనాల లైట్లు ఎదురెదురుగా పడకుండా ఉండటానికి మధ్యలో మొక్కలు నాటాల్సి ఉంది. మధ్యలో ఎర్ర మట్టి పోయలేదు. మిగతా పనుల పూర్తికి సుమారు రూ.80 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు సమాచారం.

ప్రమాదాలకు ఆస్కారం

నాలుగు వరుసల రహదారి ఎత్తుగా ఉన్న చోట బండరాళ్లు పేర్చకపోవడం వల్ల వర్షాలకు మట్టి కోతకు గురైంది. భారీ వర్షాలు పడితే మట్టి పూర్తిగా కోతకు గురై తారు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. త్వరగా బండరాళ్లు పేర్చడంతోపాటు రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. డివైడర్ల మధ్యలో లైటింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలి.– సతీశ్, కొదురుపాక

ప్రతిపాదనలు పంపిస్తాం

నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యమానేరు ఎడమ కాలువ వద్ద సుమారు రూ.కోటితో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఓవైపు వంతెన నిర్మాణం పూర్తయి రెండోవైపు పనులు చేపడుతున్నారు. రహదారి ఎక్కడైతే ఎత్తుగా ఉందో అక్కడ మట్టి కోతకు గురికాకుండా ఉండేందుకు తెట్టె కట్టడానికి పరిశీలన చేశాం. అంచనాలు రూపొందుతున్నాయి. త్వరలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తాం.– సతీశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

# అత్యవసర బృందాలు ఎక్కడ?

హైదరాబాద్: వానాకాలంలో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా అత్యవసర బృందాలు సిద్ధం చేశామని జలమండలి ఊదరగొడుతుంది. నగరంలో కురిసిన భారీ వాన రోడ్లను ముంచెత్తినా ఈ బృందాలు పత్తా లేవు. మెహిదీపట్నం నుంచి మూసీ వంతెన వరకు అనేక ప్రాంతాల్లో వరద రోడ్లపై పోటెత్తింది. మూసీ వంతెనపై మోకాళ్ల లోతున నిలిచింది. 2 గంటలపైనే ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడింది. ఖైరతాబాద్, పంజాగుట్ట, బేగంపేట, లక్డీకాపూల్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల నుంచి నీరు పొంగి రోడ్లని ముంచేసింది. మ్యాన్‌హోళ్లలోని చెత్తాచెదారాన్ని తొలగించి వరద సాఫీగా వెళ్లేలా ఈ బృందాలు సేవలు అందించాలి. నీరు బయటకు పోని చోట తాత్కాలిక మోటార్లు పెట్టి తోడించాలి. గ్రేటర్ వ్యాప్తంగా జలమండలి 125 నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించింది. మరోవైపు 16 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(ఈఆర్టీ)లు మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు సేవలు అందించేలా నియమించింది. 225 ఎయిర్‌టెక్ యంత్రాలనూ సిద్ధం చేసి కొన్ని రాత్రి వేళల్లోనూ అందుబాటులో ఉంచుతున్నట్లు ప్రకటించింది. ఇదంతా కాగితాలకే పరిమితమైనట్లు నగరంలో పరిస్థితి చూస్తే తేటతెల్లమవుతోంది. పర్యవేక్షణ కొరవడినట్లు వెల్లడైంది. జోరుగా కురిసిన వానకు నిమిషాల వ్యవధిలోనే చాలా ప్రాంతాల్లో రహదారులు కాల్వలను తలపించాయి.

## ప్రకృతి సోయగం ఆస్వాదిస్తే ఆనందం

ఆదిలాబాద్ :ఈ పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో నిలదొక్కుకునేందుకు జనాలు తీవ్ర ఒత్తిడి, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. అందుకు వారు తమ జీవన శైలిని మార్చుకుంటున్నారు. వారాంతపు సెలవుల్లో మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. మానసికోల్లాసాన్ని పొందుతున్నారు. ప్రపంచ పిక్నిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొన్ని పిక్నిక్ పాయింట్లను వివరిస్తూ కథనం.

ప్రయోజనాలు ఇలా.. : పిక్నిక్‌కి వెళ్తే ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ఒత్తిడి నుంచి ఉపశమనం ఉంటుంది. మంచి వ్యాయామం అవుతుంది. తాజా గాలి, సూర్యరశ్మి లభిస్తుంది.

కాలక్షేపానికి 'హరితవనం'

చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ హరితవనం వెళ్లేందుకు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇక్కడ పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. విజ్ఞానాన్ని పెంపొందించేలా పక్షులు, వన్య ప్రాణులు, మృగాల బొమ్మలు ఏర్పాటు చేశారు. సాహస క్రీడలు, బోటింగ్, రోప్‌పైన స్కై సైక్లింగ్ వంటి కృత్యాలు వర్షాకాలంలో చేసుకోవచ్చు. అటవీశాఖ నిర్వహణలో ఈ హరితవనం పని చేస్తుంది. ప్రవేశ రుసుము చెల్లించి లోనికి వెళ్లవచ్చు. పిక్నిక్ కోసం బడి పిల్లలు వచ్చి ఆడుకుంటారు. కాలక్షేపంతో గడుపుతుంటారు. ఆదిలాబాద్



నుంచి 7 కి.మీ.ల దూరంలో ఉంది.

వచ్చిందంటే చాలు చాలా మంది ఖండాల ప్రాంతానికి వెళ్తుంటారు. ప్రకృతి ఒడిలో విహరించినట్లు అనుభూతి పొందుతారు. పచ్చని అడవి, చిన్న చిన్న గుట్టల అందాలను చూడాల్సిందే. ఇక్కడ ఉండేందుకు గదులు లేవు. చాలా మంది ఇంటి నుంచే తయారు చేసుకున్న భోజనాలు తీసుకు వెళ్తుంటారు. ఇంకొందరు అక్కడే వంటలు చేసి ప్రకృతి రమణీయతను చూస్తూ వన భోజనాలు చేస్తుంటారు. ఇది ఆదిలాబాద్ గ్రామీణ మండలం నుంచి 40 కి.మీ.లు, ఇంద్రవెల్లి నుంచి 9 కి.మీ.ల దూరంలో ఉంది. మొలలగుట్ట వరకు వాహనాలు వెళ్తాయి. అక్కడి నుంచి 2 కి.మీ.లు కాలినడకన వెళ్తే ఖండాల పిక్నిక్ పాయింట్ వస్తుంది.గలగలపారే జలధార 'కుంటాల'

ప్రకృతి ప్రసాదించిన కుంటాల జలపాతం తెలంగాణలోనే ఎత్తైనది. గలగలపారే ఆ జలధార వద్ద నగరం నిద్రపోతున్న వేళ, రుద్రమదేవి వంటి సినిమాల సన్నివేశాలు, పాటలను చిత్రీకరించారు. జలపాతం సమీపంలో విశ్రాంతి భవనం ఉంది. దీన్ని ముందస్తుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడే చిన్న హోటళ్లు ఉన్నాయి. సందర్శకుల కోసం చిన్న గుడారాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి 62 కి.మీ.లు, నేరడిగొండ మండలం నుంచి 12 కి.మీ.ల దూరంలో ఈ కుంటాల జలపాతం ఉంది. జూన్ నుంచి డిసెంబరు వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జలపాతాన్ని వీక్షించవచ్చు.

మానసికోల్లాసానికి 'పొచ్చెర జలపాతం'

ఆత్మీయ సమ్మేళనాలకు పొచ్చెర జలపాతం వేదికగా మారింది. వర్షాకాలంలో వీటి అందం రెట్టింపవుతుంది. జలపాతం సమీపంలో షెడ్‌ను నిర్మించారు. ఇక్కడ సమావేశాలు, భోజనాలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. భోజన సౌకర్యం లేదు. ఎవరికి వారే తమవెంట స్నాక్స్, భోజనం తెచ్చుకుంటారు. మానసికోల్లాసాన్ని పంచుతున్న పొచ్చెర జలపాతం బోథ్ మండల కేంద్రం నుంచి 4 కి.మీ.లు, ఆదిలాబాద్ నుంచి 45 కి.మీ.ల దూరంలో ఉంది.

## బల్దియాలో అవిశ్వాస రాజకీయం

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పట్టణ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఇటీవల భారాస నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వైస్ ఛైర్మన్ జహీర్ రంజానిపై అవిశ్వాసానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. రెండు మూడు రోజులుగా కౌన్సిలర్ల నుంచి సంతకాల సేకరణ కొనసాగుతోంది. భారాస, భాజపాలతోపాటు కాంగ్రెస్‌లోని కొందరు కౌన్సిలర్లు, ఎంఐఎం కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నిస్తుండటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాల రాజకీయాలు మొదలైనా.. ఆదిలాబాద్‌కు వచ్చేసరికి స్తబ్దుగానే ఉంది. ప్రస్తుతం భారాసకు చెందిన మాజీమంత్రి కుమారుడు జోగు ప్రేమేందర్ ఇక్కడ పురపాలక ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. భారాసకు చెందిన కౌన్సిలర్ల సంఖ్యాబలమే ఇక్కడ ఎక్కువగా ఉంది. పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరినా భారాసనే పురపాలికలో ఆధిక్యం ప్రదర్శిస్తోంది. భారాసలో ఉన్న పుర వైస్ ఛైర్మన్ జహీర్ రంజాని లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ ప్రస్తుతం అవిశ్వాసాన్ని తెరపైకి తేవడం విశేషం. భారాస, భాజపా కౌన్సిలర్లు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఆయా పార్టీల కీలక నేతల నుంచి సూచనలు వచ్చినట్లు చెబుతున్నారు. అన్ని పార్టీల్లోనూ ఇది కాకరేపుతోంది.

అవిశ్వాస తీర్మానం కోసం ఎంఐఎం మద్దతు సైతం కూడగట్టుకునేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ సంబంధీకుడే ముందుకు రావడంతో అదే పార్టీకి చెందిన మరో ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్ల సంతకాలు సైతం సేకరించినట్టు సమాచారం. అందరూ కలిసికట్టుగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామనే సంకేతం ఇచ్చేలా పావులు కదుపుతున్నారు. పార్టీ సమావేశాలకు దూరంగా ఉన్న ఇద్దరు కాంగ్రెస్ అసంతృప్త కౌన్సిలర్ల మద్దతు కోసం కూడా చర్చిస్తున్నారు. భారాస నుంచి ఇద్దరు కౌన్సిలర్లు త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనుండటంతో వారు సంతకం చేసేందుకు ఆసక్తి కనబర్చలేదని తెలిసింది. భాజపా కౌన్సిలర్లంతా సంతకం చేశారని ఆ పార్టీవర్గాల సమాచారం. కొన్ని రోజులుగా ఈ కార్యక్రమం చాపకింద నీరులా సాగుతోంది. సోమవారం హడావుడిగా సభ్యుల ఇళ్లకు వెళ్లారు. అవిశ్వాసానికి అవసరమయ్యే సంతకాలు సోమవారం సాయంత్రానికి పూర్తయ్యాయని, ఇంకా ఎక్కువమందే సంతకాలు చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. మంగళవారమే జిల్లా కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేయనున్నట్లు సమాచారం. మరో పక్క తన పదవికి ఎలాంటి ఢోకా లేదని వైస్ ఛైర్మన్ ధీమాగా ఉన్నారని ఆయన సంబంధీకులు చెబుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. పురపాలికలోని కీలక పదవిని చేజార్చుకుంటుందా అనే చర్చ కూడా మొదలైంది.



## 22ఏ భూముల రిజిస్ట్రేషన్లు మూడు నెలలు నిలిపివేత
## అక్టోబర్ నుంచి కొత్త మద్యం విధానం
## క్యూఆర్ కోడ్‌తో పాస్ పుస్తకాలు

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. మంత్రివర్గం సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు.

22ఏ సెక్షన్ కింద ఉన్న భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు మూడు నెలల పా టు నిలిపివేస్తామని, క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్‌పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం విధానం అమలు చేస్తామన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యాన్ని అందిస్తామ ని తెలిపారు. జగన్ బొమ్మ, పేరు ఉన్న సర్వేరాళ్లను ఏం చేయాలనే అంశంపై చర్చించినట్లు తెలిపారు. దేశంలో ఫెర్టిలిటీ రేటు తగ్గుతోంది.. ఏపీలోనూ సంతానోత్పత్తి రేటు తగ్గడం అంశంపై చర్చ జరిగిందని పేర్కొన్నారు.

**బొమ్మల పిచ్చితో జగన్ రూ.700 కోట్లు వాడేశారు..** "స్థానిక ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే అనర్హత వేటు నిబంధన ఎత్తివేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిబంధన ఎత్తివేసేలా చట్ట సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరు తొలగించాలని పలువురు మంత్రులు సూచించారన్నారు. బొమ్మల పిచ్చితో నాటి సీఎం రూ.700 కోట్లు వాడేశారని మంత్రులు అన్నారని తెలిపారు. మావోయిస్టులపై మరో ఏడాది నిషేధం విధించేలా క్యాబినెట్ తీర్మానం చేసింది.

వైకాపా ప్రభుత్వం, గతంలో తెదేపా హయాంలో చేపట్టిన మద్యం విధానాలపై చర్చ జరిగింది. ఎక్సైజ్ విధానంలో అక్రమాలకు తావులేకుండా మార్పులు, చేర్పులపైనా చర్చించారు. మత్స్యకారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్న 217 జీవోను రద్దు చేస్తూ కేబినెట్ తీర్మానించాం" అని పార్థసారథి తెలిపారు.

**ఆ పాస్‌పుస్తకాలు వెనక్కి..** "సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరు తొలగించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజముద్ర ఉన్న కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి నిర్ణయం తీసుకుంది. జగన్ బొమ్మలతో ఉన్న పాస్ పుస్తకాలను వెనక్కి తీసుకోనుంది. రీ సర్వేపై క్యాబినెట్‌లో రెవెన్యూశాఖ నోట్ సమర్పించింది. దీనివల్ల తలెత్తిన వివాదాలపైనా చర్చ జరిగింది. గత ప్రభుత్వ విధానం వల్ల రీ-సర్వేపై ఆందోళన ఉందని మంత్రులు తెలిపారు. భూ యజమానుల్లో ఆందోళనతో గ్రామాల్లో వివాదాలు పెరుగుతాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. రీ- సర్వే ప్రక్రియను అబేయన్స్‌లో పెట్టాలని నిర్ణయించాం" అని తెలిపారు.

**మెడికల్ కాలేజీల్లో పోస్టుల పెంపునకు గ్రీన్ సిగ్నల్..** "నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో 150 సీట్లతో నిర్మించిన కొత్త వైద్య కళాశాలల్లో గతంలో మంజూరైన పోస్టులకు అదనంగా మరో 380 పోస్టులు భర్తీ చేయాలన్న ప్రతిపాదనను ఆమోదించింది. ఫేజ్-2కింద పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లెలో నిర్మించిన వైద్య కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 100 సీట్లతో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ కోర్సు ప్రారంభించడానికి చేసిన ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గుజరాత్‌లో ఉన్న పీపీపీ మోడల్‌ను అధ్యయనం చేయాలని సీఎం సంబంధిత శాఖల మంత్రులు, అధికారుల్ని ఆదేశించారు" అని వెల్లడించారు.

**జీవో 40 రద్దు.. సున్నిపెంటకు కేటాయించిన 280 ఎకరాలు వెనక్కి:** "జీవో నంబర్ 40 రద్దు కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించింది. మే 11, 2023న జారీ చేసిన జీవో 40 ప్రకారం నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామ పంచాయతీకి కేటాయించిన 280.74 ఎకరాల భూమిని రద్దు చేస్తూ.. దాన్ని తిరిగి నీటిపారుదల శాఖకు బదలాయించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం. ఈ భూమిని అన్ని చట్టాలను పరిగణనలోకి తీసుకుని శ్రీశైలం దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు వినియోగించుకోవాలని సూచన. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉండటంపై చర్చించాం. రాష్ట్ర భవిష్యత్తులో యువత జనాభా తగ్గిపోనుంది. ఎక్సైజ్‌శాఖలో మెరుగైన విధానాలు ప్రవేశపెట్టాలని నిర్ణయించాం. ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని నిర్ణయించాం" అని మంత్రి పార్థసారథి వివరించారు.

## జగన్ అక్రమాస్తుల కేసులపై విచారణ


దిల్లీ: జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులను తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీతో పాటు జగన్ బెయిల్ రద్దు చేసి విచారణ వేగవంతం చేయాలంటూ రఘురామ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి సీబీఐపై అసహనం వ్యక్తం చేసింది. మే 28 సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఆరుగురు జడ్జిలు మారిపోవడం, రిటైర్ కావడం జరిగిందని రఘురామ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలు తప్పు అంటూ కాలయాపన చేస్తున్నారని జస్టిస్



సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. దీనికి, ట్రయల్‌కి సంబంధం లేదని వ్యాఖ్యానించారు. డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని.. ట్రయల్ ముందుకు సాగకుండా ఇది అడ్డంకిగా మారుతోందని సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. సుప్రీంకోర్టులో తాము కూడా అనేక పిటిషన్లు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నామని.. తమకు ఎలాంటి అడ్డంకి రావడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. సీబీఐ తరఫున వాదనలు వినిపించేందుకు అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) రాజు అందుబాటులో లేరని ఇతర న్యాయవాదులు న్యాయమూర్తికి తెలిపారు. ఆయన్ను వెంటనే పిలిపించాలంటూ తదుపరి విచారణను మధ్యాహ్నం 2 గంటలకు ధర్మాసనం వాయిదా వేసింది.

## జగన్ బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని రీప్లేస్ చేస్తాం: ఏపీ ప్రభుత్వం

అమరావతి: తనకు భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా జగన్‌కు ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం రీప్లేస్ చేస్తామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం కండిషన్‌లో




ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఆయనకు ఇస్తామంది. జగన్ భద్రతా సిబ్బంది సమాచారం ఇస్తే జామర్ ఇస్తామని స్పష్టం చేసింది. దీనిపై కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది

## చేనేత దినోత్సవం.. ప్రధాని మోదీకి తెదేపా ఎంపీ అపురూప కానుక




దిల్లీ: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అపురూప కానుకను అందజేశారు. ప్రధానిగా హ్యాట్రిక్ విజయం సాధించిన మోదీ లఘు చిత్రాన్ని ఓ చేనేత కుటుంబానికి చెందిన దంపతులతో ప్రత్యేకంగా నేయించారు. ఈ కానుకను ప్రధానికి స్వయంగా అందజేశారు. ఎంపీ అప్పలనాయుడు సూచన మేరకు ఈ చిత్రాన్ని విజయనగరం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం లావేరు మండలానికి చెందిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు జూన్ మొదటి వారం నుంచి 40 రోజుల పాటు శ్రమించి పూర్తి చేశారు. మూడు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవు కలిగిన చేనేత వస్త్రంపై మోదీ చిత్రాన్ని తీర్చిదిద్దారు. బుధవారం స్వయంగా ఎంపీ అప్పలనాయుడు మోదీకి ఈ చిత్రపటాన్ని అందజేయగా.. ఆయన చాలా సంతోషం వ్యక్తం చేశారు. చాలా చాలా ధన్యవాదాలు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం రోజున ఈ కానుక అందుకోవడం ఓ తీయని జ్ఞాపకంగా భావిస్తున్నట్లు మోదీ తెలిపారు. 40 రోజులపాటు శ్రమించి చేనేత వస్త్రంపై రూపొందించిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను ప్రధాని అభినందించారని అప్పలనాయుడు తెలిపారు. అంతేకాకుండా పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని కూడా మోదీకి అందజేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గురించి మోదీ అడిగారని తెలిపారు. అశోక్ గజపతిరాజు ఎలా ఉన్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది? అని వాకబు చేశారన్నారు. పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఇవ్వగానే నాలుగైదు పేజీలు తిరగేశారని.. ఆయన ఫొటోలను మోదీ పరిశీలనగా చూశారన్నారు. గుడ్.. గుడ్.. అని ప్రశంసించారని అప్పలనాయుడు తెలిపారు. పీవీజీ రాజు ఒక సామాజిక చైతన్యవేత్త అని ప్రధాని కొనియాడారన్నారు.

## ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు.. తిలకించిన సీఎం చంద్రబాబు

అమరావతి: విజయవాడలో చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని ముగించుకొని ఉండవల్లి వెళ్తూ సీఎం చంద్రబాబు మధ్యలో ఆగారు. ప్రకాశం బ్యారేజీపై కాన్వాయ్ ఆపి కిందకు దిగిన సీఎం.. బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లను ఆసక్తిగా తిలకించారు. వరద ప్రవాహాన్ని చూసేందుకు బ్యారేజీ వద్దకు వచ్చిన సందర్శకులను దగ్గరకు పిలిచి మాట్లాడారు. దీంతో పలువురు సందర్శకులు సీఎంతో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కృష్ణమ్మకు జలకళ రావడం చూసి ఎంతో సంతోషిస్తున్నట్లు తెలిపారు. ఈ నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.





## ఘనంగా చేనేత దినోత్సవం.. ఎగ్జిబిషన్‌ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

అమరావతి: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. చేనేతకారుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విజయవాడలోని స్టెల్లా ఆడిటోరియంలో చేనేత ఎగ్జిబిషన్‌ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులు నేసిన చీరలను ఎగ్జిబిషన్ సెంటర్లో ప్రదర్శించనున్నారు. స్టాల్ ప్రారంభించిన అనంతరం ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి చేనేత దుస్తులను చంద్రబాబు స్వయంగా పరిశీలించారు. సుమారు 80కి పైగా స్టాల్స్‌లో చేనేత దుస్తులు ఉంచారు. చేనేత కార్మికులను ప్రోత్సహించే దిశగా ఈ ఎగ్జిబిషన్‌ని ప్రారంభించినట్లుగా సీఎం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బోండా ఉమా, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, హ్యాండ్లూమ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సునీత, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గుమ్మళ్ల సృజన, పురపాలక కమిషనర్ ధ్యాన చంద్ర తదితరులు పాల్గొన్నారు.

**చేనేతలను ప్రోత్సహించాలి..** జాతీయ చేనేత దినోత్సవాన్ని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో విజయవాడలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేనేత సంఘాలతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఇకపై తాను ప్రతి శుక్రవారం చేనేత వస్త్రాలు ధరిస్తానని పేర్కొన్నారు. పార్లమెంట్‌కు సైతం చేనేత వస్త్రాలు ధరించి వెళ్తానని వెల్లడించారు. విజయనగరం జిల్లా లావేరు గ్రామానికి చెందిన నాగేశ్వర్ రావు, లక్ష్మీ అనే కార్మికులు మగ్గంపై ప్రధాని మోదీ చిత్రపటాన్ని నేశారని ఆయన తెలిపారు. ఆ చిత్రపటంతోపాటు మోదీకి చేనేత వస్త్రాలు అందించినట్లు చెప్పారు. ఎంపీ మాట్లాడుతూ.. "ప్రతి ఒక్కరూ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నమాదిరిగానే, చేనేత కుటుంబాలను ప్రోత్సహించాలి. సీఎం చంద్రబాబు చేనేత కుటుంబాలను అనేక విధాలుగా ఆదుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి. అలాంటప్పుడే వారి కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుంది" అని కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు.

**బీజేపీ నేతల ర్యాలీ..** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత వస్త్రాలతో విజయవాడలో బీజేపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుజనా చౌదరి హాజరయ్యారు. విజయవాడ బీజేపీ ప్రధాన కార్యాలయం నుంచి ఆప్కో కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో సుజనా పాల్గొన్నారు. అనంతరం ఆప్కో షోరూంలో ఆయన చేనేత వస్త్రాలు కొనుగోలు చేశారు. సుజనా మాట్లాడుతూ.. "ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి. చేనేత కార్మికులను కాపాడాలి. ప్రధాని మోదీ కూడా చేనేత వస్త్రాల ప్రాముఖ్యతపై ప్రచారం చేశారు. బీజేపీ సర్కార్ ఆ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుంది" అని పేర్కొన్నారు.

## ఏపీ హోంమంత్రిని కలిసిన వైఎస్ వివేకా కుమార్తె సునీత..



అమరావతి: సచివాలయంలో ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితను వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్ వివేకా హత్య తదనంతర పరిణామాలను హోంమంత్రి దృష్టికి సునీత తీసుకెళ్లారు. జగన్ ప్రభుత్వంలో తన తండ్రి హత్య కేసులో జరిగిన అన్యాయం గురించి అనితకు ఆమె వివరించారు. కేసును పక్కదారి పట్టించేందుకు విశ్వప్రయత్నం చేశారని చెప్పారు. వైసీపీ హయాంలో హంతకులకు స్థానిక పోలీసులు అండగా నిలిచారని ఆమె హోంమంత్రి ఎదుట ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను చేస్తున్న న్యాయపోరాటానికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వంలో హంతకులకు అండగా నిలిచిన వారిపై చర్యలు తీసుకోవాలని సునీత కోరారు. విచారణ సమయంలో కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారని హోంమంత్రికి చెప్పారు. తన తండ్రిని హత్య చేసిన వారిని, వైసీపీ ప్రభుత్వంలో నిందితులను కాపాడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీబీఐ అధికారులపైనే తప్పుడు కేసులు పెట్టారని చెప్పుకొచ్చారు. కేసు విచారిస్తున్న అధికారులతోపాటు సాక్షులను కూడా బెదిరించారని వివరించారు. సీబీఐ విచారణలో ఉన్నందున ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని వైఎస్ సునీతకు అనిత హామీ ఇచ్చారు. దోషులకు శిక్షపడేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వెల్లడించారు. తప్పు చేసిన పోలీసులను సహా ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డి తీరుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యంగ్యాస్త్రాలు



అమరావతి: మదనపల్లె ఫైళ్ల దహనం వ్యవహారంపై ప్రభుత్వ, విపక్ష పార్టీ వైసీపీ నేతల మధ్య పరస్పర విమర్శల పర్వం కొనసాగుతోంది. తాజాగా మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పందించారు. "తిన మరిగిన కోడి ఇల్లెక్కి కూసినట్లుగా ఉంది మాజీ మంత్రి పెద్దిరెడ్డి తీరు" అంటూ మంత్రి వంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఫైళ్లు తగులపెట్టించి అమాయక ముఖం పెడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. పాపాలు చేసి ఫైళ్లు తగులబెట్టడడం పెద్దిరెడ్డి అలవాటుగా చేసుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి, అతని అనచరులకు వ్యతిరేకంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. మదన పల్లె ఫైళ్ల దహనం ఘటనకు ముందు కాలుష్య నియంత్రణ మండలిలో కూడా ఫైళ్లు తగలబెట్టారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రస్తావించారు. మదన పల్లె ఫైళ్ల దహనం ఘటన కుట్ర కోణంలో జరిగిందేనని అభిప్రాయపడ్డారు. సీఐడీ విచారణలో దోషులను కచ్చితంగా తేలుస్తామని, పెద్దిరెడ్డే కాదు... అంతకన్నా పెద్ద వారు ఉన్నా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

**జగన్, ఆయన కార్యకర్తలకి భయమెందుకు?: కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి :** టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. "జగన్, ఆయన కార్యకర్తలకి భయమెందుకు?. రెండు నెలలు గడవక ముందే రాష్ట్రపతి పాలన అంటున్నారు. సామాజిక బస్సుయాత్ర చేపట్టే అర్హత జగన్‌కి లేదు. జగన్ హయాంలో 28 మంది దళితులు అత్యాచారాలు, ఆపై హత్యలకు గురయ్యారు. 6 వేల మంది దళితులపై అత్యాచారాలు జరిగాయి. ఎమ్మెల్సీ అనంతబాబు ఆయన వద్ద డ్రైవర్‌గా పనిచేసే దళిత యువకుడు సుబ్రహ్మణ్యాంని హతమార్చి శవాన్ని డోర్ డెలివరీ చేశాడు. అనంతబాబుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు" అని కోటం శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. "జగన్ రూ.33 వేల కోట్ల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారు. ఏపీ కోసం జగన్ ఏ రోజైనా రాష్ట్రపతిని కలిశాడా?. ఇవాళ రాష్ట్రపతి పాలన కావాలంటున్నాడు" అని అన్నారు.

## వైసీపీకి భారీ షాక్.. పార్టీకి గుడ్ బై చెప్పిన మాజీ ఎమ్మెల్యే దొరబాబు..

కాకినాడ: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వైసీపీ పార్టీకి భారీ షాక్ ఇచ్చారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వైసీపీలో తగిన ప్రాధాన్యత సరైన గుర్తింపు లేకపోవడం వల్లే పార్టీని వీడుతున్నట్లు దొరబాబు తెలిపారు. రాజకీయ స్వలాభం కోసం కాదని, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఎలాంటి పదవులు ఆశించడం లేదని, ప్రజలకు మంచి జరగాలన్నదే తన కోరిక అని స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా ఆయన పార్టీ వీడుతున్నట్లు వార్తలు వచ్చాయి. కొంత మంది వాటిని కొట్టిపారేయగా మరికొంతమంది నిజమే అంటూ నియోజకవర్గంలో చర్చించుకున్నారు.

అయితే తాజాగా పెండెం దొరబాబు ప్రకటనతో ఉత్కంఠకు తెరదించినట్లయ్యింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలోని ఏదో ఒక పార్టీలో తాను చేరుతానని మాజీ ఎమ్మెల్యే దొరబాబు స్పష్టం చేశారు. అన్నీ పార్టీల నుంచి ఆహ్వానాలు ఉన్నాయని, అనుచరులతో చర్చించిన తర్వాతే భవిష్యత్తు నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలతో 25ఏళ్లుగా మమేకమై ఉన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. తన వెంట ఇప్పటివరకూ నడిచిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తనకు వెన్నుపోటు రాజకీయాలు తెలియవని చెప్పారు. పిఠాపురంలోనే ఉండి ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో తనకు ఎలాంటి ఇబ్బందులు లేవని వెల్లడించారు.

## వారంలో ఒక్క రోజైనా చేనేత వస్త్రాలు ధరించండి: పవన్ విజ్ఞప్తి



అమరావతి: వారంలో ఒక్కరోజైనా ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. దేశంలో అతిపెద్ద అసంఘటిత ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే రంగాల్లో చేనేత ఒకటి.. ఇదొక కళాత్మకమైన పరిశ్రమ అన్నారు. ఏపీలో ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, ఎమ్మిగనూరు, వెంకటగిరి... చేనేత వస్త్రాలకు ప్రతీకలుగా ఉన్నాయని తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన చేనేత కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. "దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత వస్త్రాలు అనే మాట ప్రజల్లో ఒక భావోద్వేగాన్ని నింపింది. అలాంటి చేనేత రంగానికి జీవంపోయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. రాష్ట్రంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం కచ్చితంగా చేనేత పరిశ్రమకు, ఈ రంగంపై ఆధారపడ్డ నేతన్నలకు భరోసా ఇస్తుంది. అదే విధంగా ప్రజలు సైతం ఈ రంగానికి ప్రోత్సాహమివ్వాల్సిన అవసరం ఉంది. కొన్నేళ్ల కిందట నేను చేనేత వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను అని చెప్పాను. ఆ క్రమంలోనే నేత వస్త్రాలను ధరిస్తున్నాను. అదే విధంగా యువత, ఉద్యోగులు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరిస్తే ఈ రంగంపై ఆధారపడ్డవారికి ధీమా కలుగుతుంది" అన్నారు.

## మొన్న కృతి.. నిన్న శ్రీలీల.. నేడు భాగ్యశ్రీ!

టాలీవుడ్ లో హీరోయిన్లకు కొరత ఉండదు. ప్రతీ వారం ఓ కొత్త భామ ఇండస్ట్రీకి పరిచయం అవుతూనే ఉంటుంది. వారిలో కొందరు వరుస అవకాశాలు దక్కించుకుని కొన్నాళ్లపాటు హవా కొనసాగిస్తారు. మరికొందరు మాత్రం ఒకటీ రెండు చిత్రాలకే పరిమితం అవుతుంటారు. అందుకే క్రేజ్ ఉన్నప్పుడే దాన్ని క్యాష్ చేసుకోవాలని భావిస్తుంటారు. ఇప్పుడు భాగ్యశ్రీ బోర్సే అనే మరో కొత్త హీరోయిన్ తెలుగు తెరకు పరిచయం కాబోతోంది. ఫస్ట్ మూవీ రిలీజ్ కాకుండానే క్రేజీ ఆఫర్స్ అందుకుంటూ దూసుకుపోతోంది. రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్రంతోనే అందాల ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ లో అమ్మడు అందరి దృష్టిని ఆకర్షించింది. పోస్టర్లతోనే యువ హృదయాలను కొల్లగొట్టింది. పాటల్లో తన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాస్ సాంగ్ లో రవితేజ ఎనర్జీని మ్యాచ్ చేస్తూ స్టెప్పులేయడమే కాదు, మెలోడీ సాంగ్ లో తన గ్లామర్ తో స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు భాగ్యశ్రీ యూత్ కి క్రష్ గా మారిపోయింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈమె సందడే



కనిపిస్తోంది. పూణేకు చెందిన భాగ్యశ్రీ బోర్సే.. మోడలింగ్ రంగంలో గుర్తింపు తెచ్చుకుని, పలు బ్రాండ్ ఎండార్స్మెంట్స్ చేసింది. 'యారియాన్ 2' మూవీతో బాలీవుడ్ లో తెరంగేట్రం చేసింది. ఇటీవల 'చందు ఛాంపియన్' చిత్రంలో స్పెషల్ రోల్ చేసింది. ఈ క్రమంలో 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అయింది. అయితే ఈ మూవీ రిలీజ్ కాకుండానే అమ్మడు పెద్ద బ్యానర్స్ లో స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు అందుకుంటున్నట్లు తెలుస్తోంది. యువ హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి కాంబోలో రూపొందుతున్న 'VD 12' సినిమాలో భాగ్యశ్రీ బోర్సేని హీరోయిన్ గా తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది.

అలానే హీరో నాని నటించే ఓ మూవీ కోసం ఆమెను సంప్రదిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైతే అందం, అదృష్టం రెండూ ఈ ముద్దుగుమ్మకు కలిసొచ్చాయి. 'మిస్టర్ బచ్చన్' విడుదలైన తర్వాత అభినయం కూడా ఉందని ప్రూవ్ అయితే, అనతి కాలంలోనే క్రేజీ హీరోయిన్ గా మారే ఛాన్స్ ఉంది. యంగ్ హీరోయిన్లలో కృతిశెట్టి, శ్రీలీల మాత్రమే ఓవర్ నైట్ స్టార్ డమ్ అందుకున్నారు. 'ఉప్పెన' సినిమాతో హీరోయిన్ గా పరిచయమైన కృతి.. బ్యాక్ టూ బ్యాక్ స్టార్ హీరోల చిత్రాల్లో నటించే అవకాశాలు కొట్టేసింది. అయితే లైన్ గా రెండు మూడు ఫ్లాప్స్ పడటంతో స్పీడ్ తగ్గించింది. మరోవైపు 'పెళ్లి సందడి'తో తెలుగులోకి వచ్చిన శ్రీలీల.. ధమాకా తర్వాత చేతినిండా ప్రాజెక్ట్స్ తో బిజీగా మారిపోయింది. కానీ ఈ మధ్య పరాజయాలు పలకరించడంతో స్లో అండ్ స్టడీగా వెళ్తోంది. ఇప్పుడు భాగ్యశ్రీ బోర్సే కూడా వస్తూ వస్తూనే వరుసగా ఆఫర్స్ దక్కించుకుంటోంది. మరి టాలీవుడ్ లో అమ్మడి కెరీర్ ఎలా సాగుతుందో చూడాలి.

## ది రాజాసాబ్ సెట్ లో హీరోయిన్ సెలబ్రేషన్స్

ఇండియన్ నెంబర్ వన్ హీరో ప్రభాస్ నుంచి నెక్స్ట్ రాబోయే సినిమా ది రాజాసాబ్. కల్కి మూవీ బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకోవడంతో నెక్స్ట్ ఫ్యాన్స్ ఫోకస్ అంతా కూడా ది రాజాసాబ్ సినిమాపైనే ఉంది. ఈ సినిమాకి సంబందించి ఎలాంటి అప్డేట్స్ సోషల్ మీడియాలో వచ్చిన వాటిపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ది రాజాసాబ్ చిత్రం నుంచి గ్లింప్స్ ని రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ లో డార్లింగ్ ప్రభాస్ స్టైలిష్ లుక్ లో చాలా హ్యాండ్సమ్ గా కనిపించాడు. దీంతో గ్లింప్స్ ప్రేక్షకులకి భాగా కనెక్ట్ అయ్యింది. మూవీపైన ఎక్స్పెక్టేషన్స్ అమాంతం పెరిగిపోయాయి. కచ్చితంగా ది రాజాసాబ్ సినిమా డార్లింగ్ ప్రభాస్ కెరియర్ లో బెస్ట్ మూవీస్ లలో ఒకటిగా ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. రొమాంటిక్ హర్రర్ కామెడీ కథాంశంతో ఈ చిత్రాన్ని మారుతి తెరకెక్కిస్తున్నారు. 2025 ఏప్రిల్ 10న మూవీ రిలీజ్ అవుతుందని ఇప్పటికే అఫీషియల్ గా కన్ఫర్మ్ చేశారు. రీసెంట్ గా మూవీ రెగ్యులర్ షూటింగ్ మళ్ళీ స్టార్ట్ అయినట్లు తెలుస్తోంది. మాళవిక మోహనన్ ది రాజాసాబ్ సినిమాతో టాలీవుడ్



లోకి అడుగుపెడుతోంది. ప్రస్తుతం మొదలైన షూటింగ్ షెడ్యూల్ లో ఆమె కూడా పాల్గొంది. ఈ సందర్భంగా షూటింగ్ లొకేషన్ లోనే మాళవిక మోహనన్ బర్త్ డే సెలబ్రేషన్స్ ని చిత్ర యూనిట్ నిర్వహించింది. వీటికి సంబందించిన ఫోటోలని అఫీషియల్ గా సోషల్ మీడియాలో పంచుకున్నారు. మాళవిక మోహనన్ షూటింగ్ సెట్ లో అడుగుపెట్టిందని, ఆమెకి గ్రాండ్ గా స్వాగతం చెబుతున్నట్లు పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ హౌస్ సోషల్ మీడియాలో పేర్కొంది. అలాగే మాళవిక మోహనన్ బర్త్ డే సెలబ్రేషన్స్ కూడా షూటింగ్ సెట్ లో చేసినట్లు తెలిపింది. ఈ రోజు ఇది క్యూటెస్ట్ మూమెంట్ ఆఫ్ ది ఇంటర్ నెట్ అని ట్వీట్ లో రాసుకొచ్చారు. ఈ బర్త్ డే సెలబ్రేషన్స్ లో మారుతి మాళవిక మోహనన్ కి కేక్ తినిపించి విషెస్ చేశారు. మాళవిక మారుతితో సెల్ఫీ తీసుకుంది.

ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ప్రభాస్, మాళవిక మోహనన్ మధ్య మంచి రొమాంటిక్ సీక్వెన్స్ లు ఈ చిత్రంలో ఉంటాయని తెలుస్తోంది. ఈ బ్యూటీ మాత్రమే కాకుండా నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కూడా ఈ చిత్రంలో కీలక పాత్రలలో కనిపించబోతున్నారు. సంజయ్ దత్ ప్రభాస్ తాత క్యారెక్టర్ లో నటిస్తున్నట్లు తెలుస్తోంది. డార్లింగ్ ప్రభాస్ కెరియర్ లో ఫస్ట్ టైం హర్రర్ కామెడీ జోనర్ లో ది రాజాసాబ్ మూవీ చేస్తున్నారు. ఈ సినిమా అతనికి ఎలాంటి సక్సెస్ ఇస్తుందనేది వేచి చూడాలి.




## కామెడీతో వారికి గట్టి పోటీనిస్తాడా?



టాలీవుడ్ లో ఇప్పుడు కావాల్సినంత మంది కమెడియన్లు ఉన్నారు. జబర్దస్త్ షో క్లిక్ అయిన తర్వాత చాలామంది వర్ధమాన హాస్యనటులు ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. ఎంతమంది వచ్చినా, ఎవరికి వారు తమ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సత్య, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి, ప్రవీణ్, సుదర్శన్ లాంటి ఈతరం కమెడియన్లు వచ్చిన తరువాత, సీనియర్ కమెడియన్ల జోరు కాస్త తగ్గిందనే చెప్పాలి. అలాంటి వారిలో అలీ కూడా ఉన్నారు. టాలీవుడ్ సీనియర్ మోస్ట్ కమెడియన్లలో అలీ ఒకరు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన.. గత మూడు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్నారు. వెయ్యికి పైగా చిత్రాల్లో నటించారు. తెలుగుతో పాటుగా హిందీ, తమిళ, కన్నడ చిత్రాల్లోనూ నటించారు. హాస్య నటుడిగానే కాకుండా హీరోగా, క్యారక్టర్ ఆర్టిస్టుగా, టీవీ వ్యాఖ్యాతగానూ గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే గత కొంత కాలంగా అలీ హవా కాస్త తగ్గిందనే చెప్పాలి. కొత్త కమెడియన్స్ వచ్చిన తర్వాత ఆయన కెరీర్ కాస్త స్లో అయినట్లు అనిపిస్తోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయం మీద ఆలీ మాట్లాడుతూ.. మంచి సినిమాల్లో భాగమవ్వాలనే ఉద్దేశ్యంతో ఆచితూచి పాత్రలు ఎంచుకుంటున్నట్లుగా తెలిపారు. కథతో పాటుగా తన క్యారెక్టర్, హీరో, డైరెక్టర్ కూడా తనకు చాలా ముఖ్యమని చెప్పారు. ఇప్పుడు "డబుల్ ఇస్మార్ట్" సినిమాలో అలీకి మంచి పాత్ర దొరికినట్లుగా తెలుస్తోంది. పూరీ జగన్నాధ్ ఆయన కోసం రాసిన కామెడీ ట్రాక్ థియేటర్లో బాగా పేలుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కు కమెడియన్ అలీ ఒక సెంటిమెంట్. కెరీర్ ప్రారంభం నుంచీ తన సినిమాల్లో ఆయన కోసం స్పెషల్ కామెడీ ట్రాక్స్ డిజైన్ చేస్తూవస్తున్నారు. కథతో సంబంధం లేకుండా అలీతో కామెడీ క్రియేట్ చేస్తుంటారు. 'ఇడియట్' లో మోటార్ సైకిల్ దొంగగా అలీని చూపించిన పూరీ.. 'అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి' చిత్రంలో హీరో ఫ్రెండ్ అప్పల రాజుగా సెపరేట్ ట్రాక్ రాసి ఒక సాంగ్ కూడా పెట్టారు. పూరీ తీసిన 'శివమణి' లో హీరోతో పాటు ఉండే రజనీకాంత్ పాత్ర ఇచ్చారు అలీకి. 'సూపర్' మూవీలో జాన్ అబ్రహం అనే ఆర్టిస్ట్ పాత్రలో బ్రహ్మానందంతో కలిసి చేసిన కామెడీ అంతా ఇంతా కాదు. 'పోకిరి'లో బిచ్చగాళ్ల సంఘం అధ్యక్షుడిగా అలీ.. బ్రహ్మీతో నడిపించే ట్రాక్ చాలా బాగా పేలింది. 'దేశముదురు' సినిమాలో అలీ కోసం క్రియేట్ చేసిన హిమాలయన్ బాబా పాత్ర భలే వర్కవుట్ అయింది. 'చిరుత'లో నచ్చిమి అంటూ అలీ చేసే హంగామా అంత ఈజీగా ఎవరూ మర్చిపోలేరు. 'బుజ్జిగాడు' మూవీలోనూ సర్పరాజు కాట్రే, బొకాడియా, కుఫ్లీ అంటూ రకరకాల పేర్లతో అలీ పాత్ర అలరిస్తుంది. ఏక్ నిరంజన్, గోలిమార్, నేను నా రాక్షసి, దేవుడు చేసిన మనుషులు, కెమెరామెన్ గంగతో రాంబాబు, ఇద్దరమ్మాయిలతో, హార్ట్ ఎటాక్, టెంపర్, లోఫర్, పైసా వసూల్, లైగర్ వంటి చిత్రాలలో అలీకి మంచి పాత్రాలు ఇచ్చారు పూరీ జగన్నాథ్. ఇప్పుడు 'డబుల్ ఇస్మార్ట్' సినిమాలోనూ సీనియర్ కమెడియన్ కోసం సెపరేట్ కామెడీ ట్రాక్ రాశారు. అమెజాన్ ఫారెస్ట్ లో మాట్లాడుకునే ఒక భాషను కనిపెట్టి మరీ ఈ క్యారెక్టర్‌ను క్రియేట్ చేసినట్లుగా తెలుస్తోంది. అలీ పాత్ర తీరుతెన్నులు, లుక్, గెటప్, భాష అన్నీ విభిన్నంగా ఉంటాయని 'డబుల్ ఇస్మార్ట్' ట్రైలర్ తోనే క్లారిటీ వచ్చేసింది. ఈ కామెడీ ట్రాక్ బాగా పండితే ఖచ్చితంగా అలీకి మళ్ళీ మరిన్ని ఆఫర్లు వచ్చి కెరీర్ స్పీడ్ అందుకునే అవకాశం ఉంది. అందులోనూ రాజకీయాలకు పూర్తిగా స్వస్తి పలికారు కాబట్టి, ఇకపై సినిమాల మీదనే ఎక్కువగా ఫోకస్ పెట్టబోతున్నారు. కాకపోతే యంగ్ కమెడియన్స్ నుంచి పోటీని తట్టుకొని అలీ ఎలా ముందుకు సాగుతారో చూడాలి.

## ఫిల్మ్ ఫేర్ 2024: బేబీ లిస్టులో ఐదు



టాలీవుడ్‌లో మ్యూజికల్ హిట్‌గా నిలిచిన "బేబీ" సినిమా, 69వ ఫిల్మ్ ఫేర్ సౌత్ 2024 అవార్డుల వేడుకలో మరో చరిత్ర సృష్టించింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్ హిట్ గా నిలిచిన విషయం తెలిసిందే. పెట్టిన పెట్టుబడికి అత్యధిక స్థాయిలో లాభాలు అందించిన చిన్న సినిమాల్లో బేబీ ఒక రికార్డ్ క్రియేట్ చేసింది. ఇక సినిమా ఏదో ఒక సందర్భంలో హాట్ టాపిక్ గా మారుతూనే ఉంది. సాయి రాజేష్ దర్శకత్వంలో, %వాఖచీ% నిర్మాతగా మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రం, 8 నామినేషన్లలో 5 అవార్డులను గెలుచుకుంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించిన ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్యల నటన ప్రేక్షకుల మనసును కదిలించింది. సినిమాకు వర్క్ చేసిన ప్రతీ ఒక్కరికీ కూడా మంచి గుర్తింపు దక్కింది. ముఖ్యంగా వైష్ణవి చైతన్య తన అద్భుతమైన నటనతో ఉత్తమ నటి (బెస్ట్ యాక్ట్రెస్) అవార్డును అందుకుంది. బేబీ సినిమా, 100 కోట్ల గ్రాస్‌ను సాధించి కమర్షియల్‌గా విజయం సాధించినందుకు ఉత్తమ చిత్రంగా (బెస్ట్ ఫిల్మ్) ఎంపికైంది. అలాగే, ఈ చిత్రానికి సంగీతం అందించిన విజయ్ బుల్గానిన్, "ఓ రెండు మేఘాలిలా" పాటతో ఉత్తమ సంగీత దర్శకుడిగా (బెస్ట్ మ్యూజిక్ కంపోజర్) అవార్డును గెలుచుకున్నారు. ఈ పాటకు సాహిత్యం రాసిన అనంత్ శ్రీరామ్ ఉత్తమ గేయరచయిత (బెస్ట్ లిరిసిస్ట్) అవార్డును సొంతం చేసుకోగా, సింగర్ శ్రీరామ్ చంద్ర ఈ పాటను హృదయాన్ని హత్తుకునేలా ఆలపించి ఉత్తమ గాయకుడిగా (బెస్ట్ సింగర్) అవార్డును అందుకున్నారు. ఈ అవార్డులు "బేబీ" చిత్రంలోని ప్రతిభను, వినూత్నతను, మరియు ప్రాచుర్యాన్ని చాటిచెప్పాయి. దర్శకుడు సాయి రాజేష్ తన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకొని ప్రశంసలు పొందారు. ఈ అవార్డుల నేపథ్యంలో "బేబీ" చిత్రంపై బాలీవుడ్‌లోనూ ఆసక్తి నెలకొంది. ఈ సక్సెస్‌ఫుల్ సినిమా హిందీ రీమేక్ హక్కులు ఇప్పటికే కొందరు నిర్మాణ సంస్థలు తీసుకున్నట్లు సమాచారం. హిందీ రీమేక్ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలో మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి. సంపూర్ణ విజయాన్ని సాధించిన ఈ చిత్రానికి గాను, బేబీ టీమ్‌కు అందరూ అభినందనలు తెలియజేస్తున్నారు. తెలుగు సినీ పరిశ్రమకు ఈ చిత్రం మరో గర్వకారణంగా నిలిచింది.

## జాన్వీని సరిగ్గా వాడుకున్న దేవర!

పాన్ ఇండియా ట్రెండ్ మొదలైన తర్వాత అనేక మంది బాలీవుడ్ యాక్టర్స్ టాలీవుడ్ లో అడుగు పెట్టారు. అలానే టాలీవుడ్ డైరెక్టర్స్ బీటౌన్ కి వెళ్లి హిందీ స్టార్ హీరోలతో సినిమాలు చేస్తున్నారు. మన ఫిలిం మేకర్స్ అక్కడి స్టార్స్ ను విభిన్నమైన పాత్రల్లో సరికొత్తగా చూపిస్తున్నారు. వారిలోని మరో కోణాన్ని ఆవిష్కరించడంలో సక్సెస్ అవుతున్నారు. తమ స్టార్స్ ని సరిగ్గా ఎలా ఉపయోగించుకోవాలో బాలీవుడ్ దర్శకులకు చూపిస్తున్నారు. ఇప్పుడు తాజాగా కొరటాల శివ సైతం జాన్వీ కపూర్ ను అద్భుతంగా ప్రెజెంట్ చేసినట్లు తెలుస్తోంది. 'దేవర' సినిమాతో దివంగత శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జూనియర్ ఎన్టీఆర్ కు జోడీగా నటిస్తోంది. ఆమె తంగం అనే పల్లెటూరి యువతి పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ లో ఆకట్టుకోగా.. లేటెస్ట్‌గా వచ్చిన 'చుట్టమల్లే' పాటతో అందరినీ మెస్మరైజ్ చేసింది. స్క్రీన్ మీద అమ్మడు ఎంతో అందంగా కనిపించడమే కాదు, రొమాంటిక్ సాంగ్ లో తారక్ తో కలిసి అద్భుతమైన కెమిస్ట్రీని పంచుకుంది. పాటకు తగ్గట్టుగా సింపుల్ స్టెప్పులతో అలరించింది. దీంతో ఇప్పుడు సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా జాన్వీనే కనిపిస్తోంది. ఇప్పటి వరకూ ఏ హిందీ సినిమాతోనూ రాని అటెన్షన్ ఈ ఒక్క సాంగ్ తో వచ్చింది.



జాన్వీ కపూర్ సినీ ఇండస్ట్రీకి వచ్చి ఆరేళ్లు దాటిపోయింది. 2018 సంవత్సరంలో 'ధడక్' అనే సినిమాతో హీరోయిన్ గా తెరంగేట్రం చేసిన ఈ బ్యూటీ.. అర డజనుకు పైగా హిందీ చిత్రాల్లో నటించింది. వాటిలో కొన్ని బాక్సాఫీస్ వద్ద బాగానే పెర్ఫార్మ్ చేసాయి కానీ, సరైన కమర్షియల్ సక్సెస్ మాత్రం దక్కలేదు. ఏవీ కూడా జాన్వీ కెరీర్ ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లడానికి ఉపయోగపడలేదు. రీసెంట్ గా వచ్చిన 'ఉలాజ్' మూవీ కూడా డిజాస్టర్ దిశగా పయనిస్తోంది. నిజాయతీగా మాట్లాడుకుంటే నటన పరంగా జాన్వీ కపూర్ తన తల్లి మాదిరిగా అద్భుతమైన నటి కాదు. కానీ అతిలోక సుందరి అందాన్ని పుణికిపుచ్చుకుంది. గ్లామర్ తో పాటుగా మంచి డ్యాన్సింగ్ స్కిల్స్ కలిగి ఉంది. కాబట్టి దర్శకులు ఆమె టాలెంట్ ను ఇతర మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. ఆమె అందచందాలను ఇంకా అందంగా తెర మీద ఆవిష్కరించవచ్చు. కానీ బాలీవుడ్ ఫిలిం మేకర్స్ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. ఇప్పుడు కొరటాల శివ 'దేవర' సినిమాతో మొట్టమొదటిసారిగా జాన్వీని గ్లామర్ క్వీన్ గా, హాట్ బ్యూటీగా చూపించి సినీ అభిమానులను ఆకట్టుకున్నారు.

## నొప్పి భరించలేనంటూ ఎంతో బాధపడింది! కీర్తి సురేష్

నటి కీర్తి సురేష్ ప్రాణ స్నేహితురాల్ని కోల్పోయిన బాధలో ఉన్నట్లు వెల్లడిచింది. 21 ఏళ్ల వయసులోనే మనిషా అనే స్నేహితురాలు మరణించి నెలరోజులవుతున్నా? కీర్తి సురేష్ ఇంకా ఆబాధ నుంచి తేరుకోలేదు. తాజాగా స్నేహితురాలి మరణించే ముందు ఎంతటి బాధని అనుభవించిందో చెప్పి మరింత శోకానికి గురైంది. %-%గడిచిన రోజులు ఎంతో కష్టతనమైనవి. నా చిన్ననాటి స్నేహితురాలు ఇంత త్వరగా నన్ను విడిచి వెళ్లిపోతుందనుకోలేదు. 21 ఏళ్లకే బ్రెయిన్ ట్యూమర్ వచ్చింది. దాంతో ఎనిమిదేళ్లు పోరాటం చేసింది. తనలా ధైర్యంగా పోరాడేవారిని ఇంతవరకూ చూడలేదు. గత నవంబర్ లో మూడవసారి సర్జరీ జరిగింది. ఆ తర్వాత నొప్పి భరించలేకపోతున్నానంటూ నా ముందు ఏడ్చేసింది. అదే తనతో



నాకున్న చివరి జ్ఞాపకం. తన ముందు నా ఎమోషన్ ఆపుకునే ప్రయత్నం చేసాను. కానీ నావల్ల కాక బయటకు వచ్చి ఏడ్చేసాను. హాస్పిటల్ లో కళ్లజోడు...మాస్క్ కింద కన్నీటిని కప్పేసాను.

చివరిగా కోమాలోకి వెళ్లినప్పుడు చూసాను. ఇంకా సొంత జీవితాన్ని ప్రారంభించలేదు. ప్రపంచాన్ని చూడలేదు. ఎన్నో కలలు కంది. అవి అలాగే మిగిలిపోయాయి. చిన్న వయసులోనే తనకి ఎందుకిలా జరిగిందో? ఆ దేవుడికే తెలియాలి. కొన్నిజీవితాలు మధ్యలోనే ముగిసిపోతాయి అన్నది ఎప్పుటూ వింటాను. అది నా స్నేహితురాలు జీవితంలోనూ చోటు చేసుకుంది. వ్యాధి తీవ్రతరం కావడంతో చనిపోయింది. కానీ తాను చివరి వరకూ చేసిన పోరాటం స్ఫూర్తి ని నింపింది. ఇది జరిగి నెలరోజులవుతున్నా ఆ జ్ఞాపకాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. తనని ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను%-% అని రాసుకొచ్చింది.

